ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 23.0



మార్చి 10న ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్ద సర్వీసు రోడ్డులో ప్రయాణికులను దించిన బస్సు విజయవాడ వైపు వెళ్లే నిమిత్తం జాతీయ రహదారిపైకి అతి వేగంగా వస్తూ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడితే, మరో ఆరుగురు స్వల్ప గాయాల పాలయ్యారు.

ఏలూరు సమీపంలోని చొదిమెళ్ల వద్ద జాతీయ రహదారిపై మార్చి 6వ తేదీ తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్ బస్సు-లారీ ఢీకొని నలుగురు మృత్యువాత పడ్డారు. మరో 17 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణం..!



మృత్యు శకటాలు..!

మితిమీరిన వేగం.. శిక్షణ లేని డ్రైవర్లతో దూసుకుపోతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు !

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు శుక్రవారం తెల్లవారుజామున వెళుతున్న వి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ఓల్వో ఏసీ బస్సు కర్నూలులో అగ్నికి ఆహుతై 19 మంది సజీవ దహనం అయ్యారు. 23 మంది గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైంది. అధికారులు అప్రమత్తమై ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్‌లపై తనిఖీలు చేపట్టారు. నిబంధనల ఉల్లంఘన.. వాహన డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో ఇలా ఎన్నో ప్రమాదాలు జరిగాయి. దీనిపై ఆంధ్రజ్యోతి కథనం..





ఏలూరు వద్ద ప్రమాద దృశ్యాలు(ఫైల్)

ప్రైవేట్ ట్రావెల్స్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు రూరల్ : కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో చనిపోయిన వారికి ఒక్కొక్కరికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని రోడ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చక్రాల అమర్‌కుమార్, జె.గోపి డిమాండ్ చేశారు. ఒడిశాలో 43 సీటింగ్ అనుమతి తీసుకొని స్లీపర్ కోచ్‌గా మార్చి అక్రమాలకు పాల్పడిన ట్రావెల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ప్రైవేటు ట్రావెల్స్ అక్రమాలకు ప్రయాణికులు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన బస్సు ఫిట్‌నెస్, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ గడువు ముగిసినా బస్సు నడపడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

జిల్లాలో 946 బస్సులపై కేసులు

ఏలూరు క్రైం : జిల్లాలో ఏ విధమైన ప్రైవేటు ట్రావెల్ బస్సులకు రిజిస్ట్రేషన్ లేదు. వేరే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని జిల్లాలోని రహదారులపై తిప్పుతున్నారు. వీటిపై మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది 24 గంటలు తనిఖీ చేస్తున్నారు. 23వ తేదీ రాత్రి కలపర్రు టోల్‌గేటు వద్ద 23 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 946 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.59,44,793 అపరాధ రుసుం విధించాం. రాష్ట్రంలోనే అత్యధికంగా తనిఖీలు చేసిన జిల్లాగా పేరుపొందాం. బస్సుల ఫిట్‌నెస్ పరిశీలిస్తున్నాం. వాహన వేగం నియంత్రణకు స్పీడ్ గన్నులతో తనిఖీ చేస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాం.



- షేక్ కరీమ్, ఏలూరు జిల్లా ఉప రవాణాశాఖాధికారి

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం

పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రైవేటు బస్సుల్లో భద్రతాలోపం భయపెడుతోంది. ట్రావెల్స్ బస్సులతోపాటు పాఠశాలలు, కళాశాలల బస్సులు చాలా వాటికి ఫిట్‌నెస్ లేకపోవడంతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నాయి. జిల్లాలో సుమారు 1200 బస్సులు రోడ్డుపై తిరుగుతున్నాయి. అధికారులు మామూళ్ల మత్తులో ఫిట్‌నెస్ లేని వాటిని వదిలిపెట్టడంతో అవి యథావిధిగా తిరుగుతున్నాయి. దీనికితోడు డ్రైవర్లకు సరైన అవగాహన లేకపోవడం కూడా ఒక కారణం. ఇక జిల్లా మీదుగా హైదరాబాద్, బెంగళూర్, పూణె, చెన్నై, అనంతపూర్, ఇటు వైజాగ్ రూట్‌లో నిత్యం సుమారు వంద ట్రావెల్స్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. సుమారు ఐదు వేల మంది ప్రయాణికుల వరకు రాకపోకలు సాగిస్తుంటారు. వారి ప్రాణాలకు రక్షణ కరువైంది. బస్సుల వేగం అరికట్టలేకపోవడం ఒక కారణమైతే.. డ్రైవర్ నిర్లక్ష్యం.. కాలం చెల్లిన బస్సులు కావడం.. మరో కారణం. ఇలాంటి బస్సుల్లో ప్రయాణాలు చేయవలసిన పరిస్థితులు ఉన్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సులకు రంగులు వేసి లైటింగ్ పెట్టి ప్రయాణికులను ఆకర్షిస్తున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి బస్సుల ఫిట్‌నెస్‌ను రవాణా శాఖ అధికారులు పరీక్షించాలి. కాని, ఏడాది గడిచినా కొన్ని బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణం.

- ఏడాది క్రితం భీమవరం పరిధిలోని దిరుసుమర్రు రోడ్డులో రొయ్యల కంపెనీ కూలీలను తీసుకువెళుతున్న బస్సు అదుపు తప్పి పంట బోదెలో తిరగబడింది. బస్సులోని 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఫిట్‌నెస్ లేని, కాలం చెల్లిన బస్సుగా అధికారులు నిర్ధారించారు.
- భీమవరం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి మంటలు రావడంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. బస్సును డ్రైవర్ ఆపడంతో అందరూ కిందకు దిగారు. బ్యాటరీ లోంచి మంటలు వచ్చినట్లుగా నిర్ధారించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

(భీమవరం క్రైం/ఏలూరు క్రైం-ఆంధ్రజ్యోతి):

రోడ్డు రవాణాలో ప్రైవేట్ ట్రావెల్స్ రారాజులుగా వర్ధిల్లుతున్నాయి. సౌకర్యవంతమైన వాల్వో ఏసీ, స్లీపర్ బస్సు సౌకర్యంతోపాటు తక్కువ సమయంలో గమ్యం చేరుస్తామని ప్రయాణికులను ఆకట్టుకుంటున్నారు. డ్రైవర్లు కొందరు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తే.. ట్రావెల్స్ యజమానుల లాభాపేక్ష ప్రయాణికుల ప్రాణం మీదికి తెస్తోంది. కేంద్ర పాలిత ప్రాంతాల్లో తక్కువ టాక్సుల నేపథ్యంలో వాహనాలు అక్కడ రిజిస్ట్రేషన్ చేయించుకుని తర్వాత రాష్ట్రానికి బదిలీ చేసుకుంటున్నారు. వాహన కండిషన్, ఇతర నిబంధనల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారు.

శిక్షణ లేదు.. విశ్రాంతి ఉండదు..!

దేశంలో ఒక నగరం నుంచి మరో నగరానికి ప్రైవేటు బస్సులు నడిపే డ్రైవర్లకు సరైన శిక్షణ లేదు. విశ్రాంతి లేకుండా గంటల తరబడి బస్సు నడపడం తో ప్రమాదాలు చోటు చేసుకుంటు నట్లు అధికారుల అధ్యయనంలో వెల్లడైంది. రాష్ట్రంలో ప్రైవేటు బస్సుల ప్రమాదాల సంఘటనలు అనేకం ఉన్నా దగ్ధమైన సంఘటలు జరిగినప్పుడల్లా అధికార యంత్రాం గం అప్రమత్తమై ఒక వైపు ప్రజలను మరో వైపు ట్రావెల్స్ వారిని, డ్రైవర్లను జాగృతం చేస్తున్నారు.

హైవే మృత్యుమార్గం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 16వ నంబర్ జాతీయ రహదారి (విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు) గుండుగొలను-రాజమండ్రి, హైదరాబాద్- రాజమండ్రి, గుడివాడ-భీమవరం మార్గాల్లో అత్యధికంగా ప్రైవేటు ట్రావెల్ బస్సులు తిరుగుతూ ఉంటాయి. ప్రధానంగా విజయవాడ-రాజమండ్రి, హైదరాబాద్- రాజమండ్రి(వయా జంగారెడ్డిగూడెం) మార్గంలో ఎక్కువ ఉన్నాయి. ప్రతి ఏడాది బస్సు రాకపోకల్లో ఐదు, ఆరు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా మీదుగా వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులపై సరైన తనిఖీలు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ప్రైవేటు బస్సులన్నీ రాత్రి వేళ ప్రయాణాలు కొనసాగించడంతో డ్రైవర్లకు విశ్రాంతి లేకపోవడం, ఎక్కువ దూర ప్రాంతాల నుంచి బస్సులను నడపడం వల్ల బస్సును నియంత్రించే శక్తిని కోల్పోయి ప్రమాదాలు జరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. జీలుగుమిల్లి నుంచి కొయ్యలగూడెం వరకు డివైడర్‌లేకపోవడంతో ఈ ప్రాంతంలోనూ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.



ర్యాలీలో పాల్గొన్న డీఐవో, వైద్యసిబ్బంది

టీకాతో పోలియో నిర్మూలన

ఏలూరు అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముందస్తు టీకాలతో చిన్నారులను పోలియో నుంచి కాపాడగలమని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శోభ అన్నారు. ప్రపంచ పోలియో దినం పురస్కరించుకుని జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలను పోలియో ప్రభావితం చేస్తుందన్నారు. టీకాల ద్వారా పోలియో పూర్తిగా నివారించవచ్చన్నారు. ప్రజల్లో వ్యాక్సినేషన్ ప్రాముఖ్యత, పోలియోపై అవగాహనకు విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం, శనివారం పోలియో టీకాలు ఉచితంగా వేస్తారని వివరించారు. మలేరియా విభాగం అధికారి గోవిందరావు, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

పది ఉత్తీర్ణతలో జిల్లా ప్రథమంలో ఉండాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఎంఈవోలు, హెచ్‌ఎంలకు సూచించారు. జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర హైస్కూల్‌లో పది మండలాల ఎంఈవోలు, హెచ్‌ఎంలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గత ఏడాది పది ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. నవంబరు నెలాఖరుకు పదో తరగతి సిలబస్ పూర్తి కావాలని సూచించారు. వంద రోజులు ప్రణాళిక ప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించి మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆశ మాట్లాడుతూ ఎఫ్ఏ-1 పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కొయ్యలగూడెం డీవైఈవో, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్యం చేయరు..!



కుక్కునూరు, వేలేరుపాడు పీహెచ్‌సీల్లో అందని సేవలు

క్లిష్టమైన కేసులు ఇతర ఆస్పత్రులకు రిఫర్

గిరిజనులకు తప్పని తిప్పలు

కుక్కునూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలకు అత్యవసర వైద్యం అందడం లేదు. రాత్రివేళ ప్రాణపాయ స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన రోగులు, బాధితులను 70 కిలో మీటర్ల దూరంలో తెలంగాణలోని భద్రాచలం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. లేదంటే 80 కిలోమీటర్ల దూరంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి వెళ్లాలి. రెండు నెలలుగా అంబులెన్స్‌లు అందుబాటులో లేవు. కుక్కునూరు, అమరవరం, వేలేరుపాడు, కోయిద ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులున్నాయి. ఏజెన్సీ ప్రాంతం కావడంతో రాత్రి వేళ పాము కాటు, గిరిజన మహిళల కాన్పుల కేసులు ఎక్కువ. ప్రాథమిక వైద్యం అందించి భద్రాచలం లేదా జంగారెడ్డిగూడెం రిఫర్ చేస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు కలిపి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని ఏజెన్సీ వాసుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బాలింతను పరీక్షిస్తున్న వైద్యాధికారి

తల్లీబిడ్డా క్షేమం

కుక్కునూరు మండలం వింజరం గ్రామ పరిధిలోని జిన్నెలగూడెం నుంచి బాలింతను డోలిపై అమరవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి తెలంగాణ ఆస్పత్రి రిఫర్ చేయడంతో అక్కడ వైద్యం పొందిన తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారని జిల్లా వైద్యాధికారి అమృతం తెలిపారు. కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. భద్రాచలంలో చికిత్సపొందుతున్న సోయం హిర్ని ఆమె బిడ్డ ఆరోగ్య బాగుందని, మెరుగైన వైద్యసేవలందేలా అక్కడి సూపరింటెండెంట్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఆమెకు సహాయంగా ఒక నర్సును ఏర్పాటుచేశారు. అమరవరం ఆసుపత్రిని సందర్శించి వైద్య సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. కుక్కునూరు, అమరవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యసేవలందేలా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య కోరారు. త్వరలో కొత్తగా అంబులెన్స్ ఏర్పాటు చేయడంతోపాటు సీటర్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామని వైద్యాధికారి తెలిపారు. అదనపు వైద్యాధికారి సురేశ్‌కుమార్ ఆమెతో ఉన్నారు.

గడచిన 24 గంటల్లో జిల్లాలో వర్షపాతం

మండలం	మి.మీ.
ముదినేపల్లి	71.4
కైకలూరు	59.6
కలిదిండి	55.8
మండవల్లి	54.8
లింగపాలెం	53
పెదవేగి	48.8
కామవరపుకోట	48
దెందులూరు	45.2
వేలేరుపాడు	41.2
పెదపాడు	36.6
ఏలూరు రూరల్	31.2
చింతలపూడి	27.4
ముసునూరు	26
కుక్కునూరు	23.6
ద్వారకాతిరుమల	23.4
నిడమర్రు	23
భీమడోలు	22
ఉంగుటూరు	21.4
ఏలూరు అర్బన్	21
చాట్రాయి	19.2
కొయ్యలగూడెం	13.8
ఆగిరిపల్లి	12.6
నూజివీడు	11.8
బుట్టాయిగూడెం	8.4
జీలుగుమిల్లి	2.4
టి.నరసాపురం	2



నీట మునిగిన పెద్ద ఎడ్లగాడి - పెనుమాకలంక రహదారి

ముంచేసింది

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- పల్లపు ప్రాంతాలు జలమయం
- వరి, ఇతర పంటలకు నష్టం
- కొల్లేరుకు వరద పోటు

జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షాలతో జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల కోత దశలో ఉన్న వరి నేలకొరిగింది. ఇతర పత్తి, పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది. రహదారులు ధ్వంసమై గోతుల్లో వర్షపు నీరు చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొల్లేరు వరద ఉధృతితో లంక గ్రామాలకు ముంపు ముప్పు పొంచి ఉంది.



పెదవేగి మండలం ముండూరులో నేలనంటిన వరి

1987 ఎకరాల్లో వరి పంట మునక

జిల్లాలో భారీ వర్షాలతో 1987 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. కైకలూరు, పోలవరం, కలిదిండి, ఏలూరు, లింగపాలెం, భీమడోలు, ముదినేపల్లి, పెదపాడు, కామవరపుకోట మండలాల్లో మొత్తం 69,891 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 31గ్రామాల్లో 1987 ఎకరాల్లో వరి పంట మునిగింది. ఉద్యాన పంటలు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది.

ఏలూరు సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి తీరం దాటినా శుక్రవారం మరో అల్పపీడనం ఏర్పడడంతో జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. పాటు పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. జిల్లాలో వరితోపాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 71.4 మి.మీ., జిల్లాలో సరాసరి 29.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

కైకలూరు/మండవల్లి/దెందులూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కైకలూరు మండలంలో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షంతో జన జీవనం స్తంభించింది. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు జాతీయ రహదారిపై గోతుల్లో నీరు నిలిచింది. వరహాపట్నం-సీతనపల్లి రహదారి కాలువను తలపిస్తోంది. గోపవరం, రాచపట్నం తదితర గ్రామాల్లోని పంట పొలాల్లోకి భారీగా వర్షపునీరు చేరింది. ఎగువ నుంచి భారీగా నీరు చేరడంతో కొల్లేరు ఉధృతి పెరిగి పెద్దఎడ్లగాడి - పెనుమాకలంక రహదారి పూర్తిగా

మిగతా 8వ పేజీలో..



ఈ-పంట, ఈ-కేవైసీ నూరు శాతం చేయాలి

వ్యవసాయ, ఉద్యాన అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి టెలీ కాన్ఫరెన్స్

ఏలూరుసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ-పంట, ఈ-కేవైసీ నమోదు నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఈ-కేవైసీ, ఈ-పంట, ఈ-క్రాప్ బుకింగ్, ఉద్యాన శాఖల లక్ష్యాలపై వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు, సిబ్బందితో శుక్రవారం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ-పంట, ఈకేవైసీ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా అధికారులు పనిచేయాలన్నారు. మరి కొద్ది రోజుల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానున్న దృష్ట్యా ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ కూడా వేగవంతం చేయాలన్నారు. సాగు సమయంలో ఎరువులు, సబ్సిడీపై విత్తనాలు పొందాలన్నా రైతులు ధాన్యం అమ్మే సమయం, తుపాను, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు బీమా, పరిహారం పొందడానికి ఈ-పంట, ఈ-కేవైసీ, ఈ-క్రాపింగ్ నమోదై ఉండాలన్నారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా రైతులకు టార్పాలిన్స్ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యాలను ఉద్యానవన శాఖాధికారులు నిర్దేశించి సమయంలో సాధించాలన్నారు. మామిడి పంటలో వ్యాధులు ప్రబలకుండా రైతులకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు, కోకో ప్రాసెసింగ్ యూనిట్లపై ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను రైతులకు తెలియజేసి దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా, ఉద్యాన శాఖ డీడీ షాజానాయక్, మైక్రో ఇరిగేషన్ పీడీ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

తెరపైకి జిల్లా పునర్విభజన అంశం

వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో లోపాలను సరిదిద్దడానికి, ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాత నియోజకవర్గాలను సమీప జిల్లాల్లో కలిపే దిశగా రెవెన్యూ యంత్రాంగం అభిప్రాయ సేకరణ చేపడుతోంది. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఎన్టీఆర్, కృష్ణా జిల్లా, గోపాలపురం నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో విలీనం చేయాలని విజ్ఞప్తులతో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది.

- ఎన్టీఆర్ జిల్లాకు నూజివీడు, కృష్ణాకు కైకలూరు
- తూర్పు నుంచి ఏలూరుకు గోపాలపురం ?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో లోపాలను సరిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో విలీనం చేశారు. దూరంగా ఉన్న ఏలూరులో వద్దని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని ఇటీవల న్యాయవాదులు, వివిధ ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టాయి. సీఎం చంద్రబాబును సైతం కలిశారు. కొన్నిచోట్ల నియోజకవర్గాల పునర్విభజనతో ఇబ్బంది లున్న నేపథ్యంలో ఆయా సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం నియమించింది. నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలోకి, కైకలూరును కృష్ణా జిల్లాలో కలిపేందుకు సాధ్యాసాధ్యాలను రెవెన్యూ యంత్రాంగం మ్యాప్‌లు, జిల్లా కేంద్రానికి దూరాభారం తదితర అంశాలపై కసరత్తు చేస్తోంది. నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు అర్బన్, రూరల్, చాట్రాయి, ముసునూరు, ఆగిరపల్లి, కైకలూరు నియోజకవర్గంలోని కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో ప్రజల అభిప్రాయాలను రెవెన్యూ వర్గాలు సేకరిస్తున్నాయి. కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వారి అభిప్రాయాలను ఒక నివేదిక రూపంలో మంత్రివర్గం ఉపసంఘం ముందు ఉంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

కాగా తూర్పుగోదావరి జిల్లాలో గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాలను ఏలూరులో కలిపేందుకు కూడా తూర్పుగోదావరి జిల్లా అధికారుల కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. ఈ నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలం ఒక్కటే భౌగోళికంగా ఏలూరు

మిగతా 8వ పేజీలో..



వంగాయిగూడెం నుంచి కొత్తూరు వెళ్లే రహదారి

గజానికో గుంత

భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

నేటి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ, న్యూరాలజీ ఓపీ సేవలు

లోపలి పేజీల్లో..

సర్వ దోషాలకు స్వస్తి



నేడు నాగుల చవితి పండుగ

కార్తీక శుద్ధ చతుర్దశి నాడు హిందువులు వేడుకగా నాగుల చవితి పండుగను నిర్వహిస్తారు. ప్రకృతి, జంతువుల పట్ల గౌరవ సూచికంగా ఈ వేడుకను నిర్వహించడం సంప్రదాయం. శనివారం నాగుల చవితి పురస్కరించుకుని పుట్టలో ఏ పాలు పోయాలి... ఏ సమయం మంచిది ? తదితర విషయాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ద్వారకాతిరుమల/ఏలూరు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మంలో పాములకు విశేష ప్రాధాన్యం ఉంది. పాములను పూజించడం అనే ఆచారం అనాదిగా వస్తోంది. ఏపీ తెలంగాణలోని తెలుగువారు ఈ పండుగను జరుపుకోవడం ఆచారం. ఈ పండుగ రోజున భక్తులు ఉపవాసం ఉండి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. తమ పిల్లల శ్రేయస్సుకోసం నాగ దేవతల ఆశీర్వాదాన్ని కోరుకుంటారు. పుట్టలో ఆవుపాలతో పాటు గుడ్లను వేస్తారు. జంటనాగుల విగ్రహాలకు పసుపు, కుంకుమలతో పూజలు, అభిషేకాలు చేస్తారు. పుట్టల వద్ద బాణసంచా కాల్చుతూ సంతోషంగా గడుపుతారు. మహిళలు సౌభాగ్యం కోసం, సంతానప్రాప్తి కోసం సర్పపూజను చేస్తారు. నాగులచవితి రోజున నాగదేవతను పూజిస్తే రాహు, కుజ, కాలసర్ప దోషాలు తొలుగుతాయన్నది భక్తుల నమ్మకం. ఇంటిల్లిపాది దగ్గరలో ఉన్న పుట్ట వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆదిశేషు అనుగ్రహం పొందాలని కామవరపు కోటలోని లలితా శ్రీపీఠం వ్యవస్థాపకుడు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు తెలిపారు.

పాలు పోసే సమయమిలా..

కార్తీక మాసంలో నాగులచవితిని పురస్కరించుకుని శనివారం చవితి తిథి అక్టోబరు 25 తెల్లవారుజామున 01.19 గంటలకు ప్రారంభమై మరుసటిరోజున తెల్లవారుజామున 03.48 గంటలకు ముగుస్తుంది. ఇక పుట్టలో పాలు పోసేందుకు, నాగదేవతల పూజకు ఉదయం 8.59 నుంచి 10.25 గంటల వరకు ఉంటుందని పండితులు చెబుతున్నారు.

పాటించే ఆచారాలు..

ఉదయం స్నానాది కార్యక్రమాల అనంతరం భక్తులు నాగదేవత విగ్రహాన్ని ప్రార్థన మందిరంలో ఉంచి పూజలు చేస్తారు. ఎక్కువమంది పుట్టల వద్దకు వచ్చి పూజలు చేస్తారు. నాగ దేవునికి నువ్వుల లడ్డు, బియ్యంపిండి, బెల్లం కల్పిన తీపి వంటకం నైవేద్యంగా సమర్పిస్తారు. ఆవుపాలు పుట్టలలో పోస్తారు. తాంబూలం ఇస్తారు.

నాగుల చవితి ప్రాముఖ్యత

హిందూమతంలో నాగుల చవితి పండుగ చేసుకునేందుకు లోతైన ఆధ్యాత్మిక, పర్యావరణ ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే పాములను దైవిక జీవులుగా భావిస్తారు. నాగుల చవితి రోజున నాగులను పూజిస్తే సర్వరోగాలు తొలుగుతాయట. వైవాహిక జీవితంలో సంతోషం ఉంటుంది. దాంపత్యదోషాలు, గర్భదోషాలు, అనారోగ్యసమస్యలు తొలగిపోతాయని నమ్మిక. కుజ, కాలసర్ప దోషానికి అధినేత సుబ్రహ్మణ్యేశ్వరుడు. కనుక పుట్టకు పూజచేస్తే ఆ దోషాలు తొలుగుతాయని నమ్మకం.. కుజ దోషం ఉంటే నాగులచవితి రోజున పూజలు చేయడం శుభ్రపదం అంటున్నారు పండితులు.

వ్యవసాయ శ్రేయస్సు

వ్యవసాయంలో మనకు ఎంతగానో సహకరించే పాములను పంటల రక్షకులుగా రైతులు చూస్తుంటారు. ఎందుకంటే అవి పంటలను నాశనం చేసే ఎలుకలను తిని వాటి పెరుగుదలను నియంత్రిస్తాయి. భూమిని వ్యవసాయానికి అనుకూలంగా సారవంతమైనదిగా చేయడంలో పాములు ప్రముఖపాత్ర పోషిస్తాయి. అందువల్ల పాములను పూజించడం ద్వారా రైతులు సమృద్ధిగా పంట పండేందుకు గాను వాటి ఆశీర్వాదాలు కోరుకుంటారు.

తేగలకు భలే డిమాండ్

ఆకివీడు/ఆచంట/తణుకు/గణపవరం : మన పూర్వీకులు ప్రజలకు ఆరోగ్యానిచ్చే వాటిని ప్రసాదాలుగా వినియోగించేవారు. వాటిలో బురగుంజుల తాటి తేగలను నాగుల చవితికి తప్పనిసరిగా పుట్టకు దగ్గర ప్రసాదంగా పెడుతుంటారు. అనంతరం భక్తులు తేగలు తింటారు. తేగలో పీచు పదార్థం ఉండడంతో రోజుకో తేగ తినడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుండడమే కాకుండా పౌష్టికాహారం ఉపయోగపడుతుంది . మార్కెట్‌లో బుర గుంజు తాటితేగ ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.15 వరకు అమ్ముతున్నారు. ఆకివీడు, ఆచంట, గణపవరం మార్కెట్లలో, తణుకు



గణపవరంలో తేగలు అమ్ముతున్న మహిళ

పట్టణంలోనూ తేగలను బళ్లపై పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు.

నాయుడుగూడెంలో గోమాతకు సీమంతం



ఆవుకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

పెదపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం నాయుడు గూడెం గ్రామంలో ఆవుకు సీమంతం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అక్కినేని సురేంద్ర కుటుంబసభ్యులు తమ గోశాలలోని ఆవుకు శుక్రవారం సీఎం కార్యక్ర మాన్ని నిర్వహించారు. తొమ్మిదో కాన్పుకు సిద్ధంగా వున్న గోమాతకు అర్చకుల వేదమంత్రాల మధ్య గోవుకు పసుపు, కుంకుమ అందజేసి నూతన వస్త్రాలు, సారె సమర్పించి గోప్రదక్షిణతో చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అక్కినేని కుటుంబసభ్యులతో పాటుగా మహిళలు పాల్గొని గోమాతకు అక్షింతలు వేసి హారతులిచ్చి ఆశీర్వచనాలను పొందారు. అనంతరం పలువురికి తాంబూలాలను అందజేశారు.



కోళ్ల వ్యర్థాల వాహనాల నిలుపుదల చేసే స్థలంలో అయ్యప్పస్వాముల నిరసన

ముక్కు మూసుకుని అయ్యప్పస్వాముల నిరసన

» కాలువ పక్కన కోళ్ల వ్యర్థాల వాహనాలు తీసేయాలని డిమాండ్

పెదపాడు,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న కోళ్ల వ్యర్థాల వాహనాలను పట్టుకుంటున్న పోలీసులు వాటిని పెదపాడు గ్రామ సమీపంలో కాలువ పక్కనే పార్కింగ్ చేయడం వల్ల తీవ్ర దుర్వాసన వస్తోందని, వాహనాలను అక్కడి నుంచి తీసివేయాలని పెదపాడు ప్రాంత అయ్యప్పస్వాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ ప్రాంతంలో ముక్కు మూసుకుని నిరసన తెలిపారు. పక్కనే వున్న కాలువలో మూడు పూటలా స్నానాలు ఆచరిస్తామని తెలిపారు. అనంతరం స్వాములంతా పెదపాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వాహనాలను అక్కడి నుంచి తీసివేయాలంటూ పోలీసు సిబ్బందిని కోరారు. ఇప్పటికే కొన్ని వాహనాలను వేరే ప్రాంతానికి తరిం చామని, మిగిలిన వాహనాలను తీసేలా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కట్టా శారదాసతీష్ తెలిపారు.

రైల్వే అధికారులతో కేంద్ర మంత్రి వర్మ భేటీ

కోటిపల్లి- నరసాపురం లైన్ ఆలస్యంపై ఆరా

టీపీగూడెంకు వందేభారత్ హాల్ట్ తప్పనిసరి

భీమవరం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలలో నరసాపురం-కోటిపల్లి రైల్వే లైన్ పనులు ఆలస్యం అవ్వటానికి కారణాలు, నరసాపురం-మచిలీపట్నం రైల్వేలైన్ పనుల ప్రస్తుత స్థితి, నరసాపురం పార్లమెంట్ పరిధిలోని భీమవరం, నర్సాపురం తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లలో అమృత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పనుల పురోగతి పైన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ రైల్వే అధికారులతో చర్చించారు. విజయవాడ లోని డివిజనల్ రైల్వే కార్యాలయంలో శుక్రవారం డీఆర్‌ఎం మోహిత్ సోనాకియాతో భేటీ అయ్యారు. జిల్లాలోని పలు రైల్వే స్టేషన్‌లలో ఆధునిక సదుపాయాల కల్పన కోసం అదనపు నిధులు మంజూరుపై ఆయన చేసిన ప్రతిపాదనలపైన, వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాడేపల్లిగూడెంలో హాల్ట్ కల్పించవలసిన ఆవశ్యకతను రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. అత్తిలి స్టేషన్లలో శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ సదుపాయం కల్పనపై ఆరా తీశారు.

పాలకొల్లులో అల్లూరి జాతీయ ఫిలిం ఇన్‌స్టిట్యూట్



విలేకరులతో మాట్లాడుతున్న ఫిలిం ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో వచ్చే జనవరిలో అల్లూరి సీతారామరాజు జాతీయ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఫిలిం ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశానికి ఫిలిం ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంస్థ గౌరవ సలహాదారు, మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామజోగయ్య మాట్లాడుతూ ఈప్రాంత కళాకారులను ప్రోత్సహించాలన్న ధ్యేయంతో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఫిలిం ఇనిస్టిట్యూట్‌ను నెలకొల్పాలని సంకల్పం చేయడం జరిగిందని, ఇనిస్టిట్యూట్‌లో చేరి శిక్షణ పొందాలన్న ఆసక్తికలిగిన వారు నవంబరు నెలాఖరు నాటికి దరఖాస్తులు తమ కార్యాలయానికి పంపాలని తెలిపారు. సంస్థ కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. గౌరవ సలహాదారుగా చేగొండి వెంకట హరిరామ జోగయ్య, గౌరవాధ్యక్షుడుగా గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, అధ్యక్షుడిగా ముత్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా డీటీడీసీ బాబు, బోణం వెంకట నర్సయ్య, కార్యదర్శిగా డాక్టర్ కెఎస్‌పిఎన్ వర్మ, సహాయ కార్యదర్శిగా విఠాకుల వెంకట రమణ, కోశాధికారిగా కలిదిండి గణపతిరాజులతో పాటు మరో 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఇనిస్టిట్యూట్‌కు ప్రముఖ దర్శకుడు రాజా వన్నెంరెడ్డి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. శిక్షణ 2నెలలు ఉంటుందని తెలిపారు.

హిందూ సమాజ స్థాపనే ధ్యేయం

పెనుగొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):హిందూ సమాజ స్థాపనే ధ్యేయంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పని చేస్తుందని దత్త పీఠాధిపతులు సాయి దత్త నాగానంద సరస్వతి స్వామిజీ అన్నారు. సిద్ధాంతంలో విజయగోపాలస్వామి దేవస్థానంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర సహ సంయోజక్ సత్తి షణ్ముఖ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ 100 సంవత్సరాల్లో సాధించిన విజయాలు, సామాజిక సేవా కార్యక్రమాలు తెలియజేయడం కోసం ప్రతీ ఇంటికి వెళ్ళి కరపత్రం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం నవంబరు 2 నుంచి 9 వరకు ఉంటుందని తెలిపారు.

అధ్యక్షా..

» విద్యార్థులకు పోటీలు నిర్వహించి.. నియోజకవర్గం నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎంపిక

» 31న రాష్ట్రానికి విద్యార్థుల జాబితా అందజేత

స్టూడెంట్ అసెంబ్లీకి ఉమ్మడి జిల్లా నుంచి 15 మంది విద్యార్థులు

భీమవరం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో రాజకీయ చైతన్యం, ప్రభుత్వ విధానాలు తెలిపేందుకు ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన స్టూడెంట్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపికకు ఉమ్మడి జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా నుంచి 15 మంది విద్యార్థులను ఎంపిక చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేయాల్సి ఉంది. 15 నియోజకవర్గాల నుంచి ఎంపిక పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఈ నెల 24, 25 తేదీల్లో మండల స్థాయిలో పోటీలు నిర్వహించాలి. భారీ వర్షాల కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో మండల పోటీలు 27, 28 తేదీల్లో జరగనున్నాయి. నియోజకవర్గ స్థాయి పోటీలు 29,30 తేదీల్లో నిర్వహిస్తారు. ఎంపిక జాబితాను ఈనెల 31న రాష్ట్రానికి జిల్లా జాబితాగా పంపిస్తారు. వీరంతా వచ్చేనెల 24న అసెంబ్లీకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకుని 25న అక్కడ అంశాలపై అవగాహన పొంది 26న అసెంబ్లీలో పాల్గొననున్నారు.

విద్యార్థులను ఎంపిక చేసేది ఇలా..

స్టూడెంట్ అసెంబ్లీకి వెళ్లే వారిని మునిసిపల్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివేవారిని ఎంచుకుంటారు. వీరికి వ్యాసాలు, ఉపన్యాసాలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. పాఠశాలకు ముగ్గురిని ఎంచుకుని వారికి పోటీలు నిర్వహిస్తారు. తదుపరి మండలం నుంచి మూడుగా నిర్ణయించి నియోజకవర్గంలోని మండలాల మధ్య విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. వారికొకరిని నియోజకవర్గానికి ఎంపిక చేస్తారు.



కోడేరు వద్ద ఏటిగట్టును కమ్మేసిన పిచ్చిమొక్కలు

ఏటిగట్టును కమ్మేసిన పిచ్చిమొక్కలు

ఆచంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వశిష్ట గోదావరి ఏటిగట్టు రహదారి గత కొన్ని సంవత్సరాలుగా పూర్తిగా ధ్వంసమై పలు చోట్ల కనీసం ప్రజలు నడవడానికి వీలు లేకుండా ఉంది. ప్రస్తుతం ఏటిగట్టు రహదారి ఆచంట మండలం భీమలాపురం నుంచి పెనుగొండ మండలం సిద్ధాంతం వరకు అనేక చోట్ల ఏటిగట్టుకు ఇరువైపులా పెద్దపెద్ద పిచ్చిమొక్కలు కమ్మేసి ఉండడం వల్ల ఈ ఏటిగట్టు పలు చోట్ల చిట్టడివిని తలపిస్తుంది. ఈ నేపథ్యంలో ఏటిగట్టుపై ప్రయాణించే వారు కరువయ్యారు. విషసర్పాలు ఏటిగట్టుపై నిరంతరం స్వైర విహారం చేస్తున్నాయి. ఏటిగట్టుపై ఇరువైపులా కమ్మేసిన పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఆలయంలో గోపూజ చేస్తున్న ఈవో చందన

మద్ది క్షేత్రంలో సప్తాహ మహోత్సవాలు

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):కార్తీక మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం గురవాయిగూడెంలో వున్న మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో సప్తాహ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, అనంతరం ఈవో ఆర్‌వీ.చందన భజనా పాళీలకు వరుణులు అందచేసి సప్తాహ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు వారం రోజులపాటు నిర్విరామంగా భక్తి సంకీర్తనలు జరుగుతాయన్నారు. ఆలయంలో గోపూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో ఆర్‌వి.చందన మాట్లా డుతూ ఈనెల 26న జరగబోయే స్వామివారి గ్రామోత్సవం తుఫాన్ కారణంగా నవంబరు రెండో తేదీ ఆదివారానికి మార్పు చేశామని భక్తులు సహకరించాలని కోరారు.

కళా ఉత్సవ్‌లో కైకలూరు విద్యార్థినులు సెకండ్

కైకలూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌లో కైకలూరు విద్యార్థినులు ద్వితీయస్థానం సాధించారు. శుక్రవారం విజయవాడలో జరిగిన కళాఉత్సవ్ 2025 రాష్ట్రస్థాయి పోటీల్లో కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతుల విద్యార్థినులు బృందగానం చేసి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. వీరికి గైడ్ టీచర్‌గా సంగీతం టీచర్ భాస్కర్‌వరప్రసాద్ వ్యవహరించారు. ఈ విద్యార్థినులను హెచ్‌ఎం టి.వినోద, ఎంఈవోలు డి.రామారావు, శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ బషీర్‌ఖాన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ఏనుగువానిలంకలో తాగునీటి కష్టాలు తీరుస్తాం

యలమంచిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏనుగువానిలంక గ్రామ ప్రజల తాగునీటి కష్టాలు తీరేలా పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నట్టు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. భారీ వర్షంలో సైతం ఏనుగువానిలంక గ్రామంలో మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శుక్రవారం పర్యటించారు. గ్రామంలో రూ.82.50లక్షలతో చేపట్టనున్న మంచినీటి సరఫరా పథకం పనులకు మంత్రి శంకుస్థాపనలు చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో రూ.1.50కోట్లతో ఏనుగువానిలంక, బాడవ గ్రామాలకు నరసాపురం ప్రధానకాలువ నుంచి నేరుగా పైపులైను ద్వారా తాగునీరు తీసుకువచ్చామని, నేడు సురక్షితమైన తాగునీరు అందేలా మైక్రో ఫిల్టర్ బెడ్, శివారు ప్రాంతాలకు పైపులైన్ విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు.



ఏనుగువానిలంకలో తాగునీటి పథకం పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల





తాడేపల్లిగూడెం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి.. నరసాపురం ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

ముంపు బాధితుల్ని ఆదుకుంటాం

నరసాపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముంపు ప్రాంతాల్లో బాధితుల్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని విప్ నాయకర్ హామీ ఇచ్చారు. శుక్రవారం వేములదీవి, వడ్డీవారిమెరక, సర్దుగొడప, కాపులగొడప ప్రాంతాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలు, గృహాలను పరిశీలించారు. బాధిత కుటుంబాలతో చర్చించారు. అధికారులతో చర్చించి తక్షణ సాయం చేస్తామన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రూ.2.35లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల్ని ఆరుగురికి అందించారు. ఎంపీడీవో వీరభద్రరావు, సర్పంచ్ ఒడుగు ఏసుబాబు, ఉంగరాల నాగరాజు, బందెల రవీంద్ర పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ మద్దతు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ స్వేచ్ఛ వచ్చిందని తన వంతు కూడా సహకారం అందిస్తున్నానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేరొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ శేషులత అధ్యక్షతన సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా పనితీరు, నిధుల లభ్యత గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు పునర్నిర్మాణానికి నిధులు తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ఇప్పటికే బాదంపూడి ప్రత్తిపాడు రోడ్ల నిర్మాణానికి నిధులు తెచ్చామని వచ్చే సంక్రాంతి లోపు బస్సులు తాడేపల్లిగూడెంలోకి వచ్చే విధంగా రోడ్లు నిర్మించే బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.చంద్రశేఖర్, తహసీల్దార్ ఎం సునీల్‌కుమార్, జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు తదితరులు మాట్లాడారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

తాడేపల్లిగూడెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డుకు చెందిన కర్రి కృష్ణకుమారికి అత్యవసర ఆపరేషన్ చేయాల్సిన సమయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలిశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సీఎం కార్యాలయం అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లోనే రూ.2లక్షలు మంజూరు చేయించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.2లక్షల మంజూరు పత్రాన్ని శుక్రవారం అందజేశారు. 18వ వార్డు ఇన్‌చార్జి పాపారావు, రాజేష్, జనసేన పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబి పాల్గొన్నారు.



పీఎం లంకలో సముద్ర గోడ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

డిసెంబరు నాటికి సముద్ర గోడ నిర్మించాలి

నరసాపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామం పీఎం లంకలో రూ.13.50 కోట్లతో చేపడుతున్న సముద్ర గోడ నిర్మాణ పనులను శుక్రవారం కలెక్టర్ నాగరాణి పరిశీలించారు. నిర్మాణ పనులపై ఆరా తీశారు. డిసెంబరు నెలాఖరుకు ఈ గోడ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా అధికారులను సంప్రదించాలని సూచించారు. 400 మీటర్లకు 200 మీటర్ల పరిధిలోని జియో వాల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్పడంతో మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వాయుగుండం కారణంగా మత్స్యకారులు ఎవరూ సముద్రవేటకు వెళ్లరాదని, ఎవరైనా వెళ్లి వుంటే వారిని వెనక్కి రప్పించాలని ఆదేశించారు. పీఎం లంకలో పీఎంఏవైజీ పథకం కింద 78 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం లక్ష్మణేశ్వరం బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు పరిశీలించి, విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. బాల్యంలో చదువు తప్ప, సెల్ ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఆర్డీవో దాసిరాజు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సీఈ వో గణేష్, బీసీ సంక్షేమాధికారి సూరిబాబు, డాక్టర్ లోక్‌మన్, జి.పిచ్చయ్య, పి.మోహన్, తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామ సభలు

తొలి రోజు ఆరు వినతులు



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో దాసిరాజు

మొగల్తూరు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):కెపిపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలో రీ-సర్వే గ్రామ సభలను రైతులంతా సద్వినియోగం చేసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభ దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకురావాలని నరసాపురం ఆర్డీవో దాసిరాజు తెలిపారు. శుక్రవారం కెపిపాలెం సౌత్ గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాలుగు రోజుల పాటు రెవెన్యూ సర్వే సిబ్బంది గ్రామంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. కెపిపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలో రీ-సర్వే పూర్తి చేయడానికి అసైన్డ్ భూములు గలవారు జాయింట్ ఎల్‌పీఎం విభజన కోసం, ఈ రీసర్వేపై అభ్యంతరాలు ఉన్నవారు విధిగా ఈ గ్రామ సభకు హాజరై వారి వద్ద గల హక్కు వివరాలు అందించాలన్నారు. వాటిని ఫిర్యాదు రూపంలో తీసుకుని పరిష్కరిస్తామన్నారు. శుక్రవారం తొలిరోజు గ్రామ సభలో ఆరు దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. ఈసభలో ఏడి జాషువా, డీఐవో కుమార్, డీటీ సంధ్య, సర్వేయర్ శ్రీనివాస్, కెపిపాలెం నార్త్ సర్పంచ్ కడలి సోంబాబు, ఎంపీటీసీ అందే దొరబాబు, రైతులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తీరు బాధాకరం

రామరాజు తీరుపై టీడీపీ శ్రేణుల అసహనం

నరసాపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పని చేసే నాయకుడిని టీడీపీ ఇన్‌చార్జి రామరాజు విస్మరించడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహన్‌రావు అన్నారు. శుక్రవారం రాయపేట టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. రామరాజు తీరును నిరసిస్తూ నల్లకండువాలు కప్పుకుని నిరసన తెలిపారు. ఏఎంసీ ఆహ్వాన పత్రికలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పేరు ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. ఇదే తీరు రామరాజు వ్యవహరిస్తే పార్టీకే చెడ్డ పేరు వస్తుందన్నారు. పార్టీకి నష్టం కలిగిస్తున్న ఇన్‌చార్జి రామరాజును ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై అధిష్ఠానం కల్పించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండేటి శ్రీను, సత్యనారాయణ, రాము, నరేంద్ర, నడిపూడి కృష్ణ, పోలిశెట్టి సత్తిబాబు, దానియేలు, రఘు, రెడ్డిం శ్రీను, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

26న నరసాపురం ఏఎంసీ ప్రమాణ స్వీకారం

నరసాపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించే ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కమిటీలు కృషి చేయాలని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో వివిధ కమిటీలతో సమావేశం నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్నారన్నారు. కావున నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై కమిటీలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, వాతాడి ఉమా, సంకు బాస్కర్, అనంత రామారావు పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ ఎంబీఎస్ ప్రసాద్

సీఆర్ రెడ్డి కాలేజీలో రాష్ట్ర టేబుల్ టెన్నిస్ పోటీలు

పెదపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమ శిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని సర్ సీఆర్‌రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎం.బి.ఎస్.ప్రసాద్ అన్నారు. వట్లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం జరిగాయి. ఈ పోటీల్లో 11, 13, 15 సంవత్సరాల వయోపరిమితి గల బాలబాలికల విభాగంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలనతో ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల మధ్య పోటీలు నిర్వహించి విజేతలకు ట్రోఫీ, మెడల్స్, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వడ్లపట్ల మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, శ్రీహరి రామకృష్ణంరాజు, పీడీ సంజీవరావు తదతరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్ ఆచార్యునికి యంగ్ సైంటిస్ట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సంతోష్‌కుమార్

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా సేవలందిస్తున్న డాక్టర్ గుగులోతు సంతోష్‌కుమార్ సింగపూర్‌లో యంగ్ సైంటిస్ట్ అవార్డును అందుకున్నారు. సింగపూర్‌లోని నాన్యాంక్ టెక్నాలజీ యూనివర్సిటీ (ఎన్.టీ.యూ) ఇంజనీరింగ్ విభాగంలో పలు పరిశోధనలు చేసి అద్భుత ప్రతిభ కనపర్చిన యంగ్ సైంటిస్ట్‌లకు ప్రతీ ఏడాది అవార్డు అందిస్తుంది. దీనిలో భాగంగా సింగపూర్‌లో జరిగిన కాన్ఫరెన్స్ యంగ్ సైంటిస్ట్ అవార్డును లండన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన ఆచార్యులు మనీష్ చేతలమీదుగా డాక్టర్ సంతోష్‌కుమార్ చేసిన బ్యాటరీ థర్మల్ మేనేజ్మెంట్ సిస్టం అనే పరిశోధనను మెచ్చుకుని అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వి రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు జి.రవికిరణ్‌శాస్త్రి, వి.సందీప్, ఎన్.జయరాం, కార్తికేశాద్రి, వీరేశ్‌కుమార్, కె.హిమబిందు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ, న్యూరాలజీ ఉచిత ఓపీ సేవలు

ఏలూరు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ, న్యూరాలజీ ఉచిత ఓపీ సేవలను ఈనెల 25 నుంచి రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. విజయవాడలో ఉన్న అను న్యూరో కార్డియాక్ ఆసుపత్రి వారి సహకారంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ ఓపీ విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఇకో పరీక్షలను ఉచితంగా చేయనున్నారు. శనివారం ఉదయం ఓపీ సేవలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి, ముఖ్య అతిథులుగా ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏలూరు ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి పాల్గొననున్నారు.

గజానికో గుంత

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పలు ప్రాంతాల్లోని రోడ్లు గజానికో గొయ్యి మాదిరిగా తయారయ్యాయి. కొన్ని రోడ్లు వాహనదారులు వెళ్లేందుకే కాదు.. కనీసం నడిచి కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. కొన్ని రహదారుల పరిస్థితిపై ఆంధ్రజ్యోతి కథనం.



వంగాయగూడెం నుంచి కొత్తూరు వెళ్లే రహదారి

నడవడానికి దారి వెతుక్కోవాల్సిందే..

ఏలూరు రూరల్ : ఏలూరు నగరంలో రహదారులన్నీ భారీ వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. పెద్దపెద్ద గుంతల్లో నీళ్లు నిలిచి చెరువుల్లా మారాయి. వాహన చోదకులు ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. ఏలూరు వంగాయగూడెం సెంటర్ నుంచి కేన్సర్ హాస్పిటల్స్‌కి వెళ్లే రహదారి సుమారు రెండు కిలోమీటర్లు పైగా రహదారి ధ్వంసమైంది. నడవడానికి కూడా దారి వెతుక్కోవల్సిన దుస్థితి నెలకొంది. ఈ గుంతలను పూడ్చండి మహాప్రభో అని ప్రజలు మొత్తుకుంటున్నారు.

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

పెనుగొండ-సిద్ధాంతం రహదారి అధ్వానం

పెనుగొండ : పెనుగొండ-సిద్ధాంతం రహదారి అధ్వానంగా తయారైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెనుగొండ - సిద్ధాంతం రహదారిని ఏడేళ్ల క్రితం విస్తరించారు. పెనుగొండ మీదుగా సిద్ధాంతం వెళ్లే రహదారిలో మధ్యలో ఉన్న గ్రామాలు పెనుగొండ, వెంకట్రామపురం, వడలి, సిద్ధాంతం గ్రామాల్లో సిమెంట్ రహదారులు నిర్మించారు. గ్రామాల శివారు నుంచి ప్రారంభమయ్యే రహదారి ప్రతీ ఏటా వర్షాలకు గోతులమయంగా మారుతూ ప్రయాణికులను మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ రహదారిలోని భారీ గోతులు వర్షాల సమయంలో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మల్లప్పదిబ్బ, వడలి, రామన్నపాలెం, సిద్ధాంతం, సిద్ధాంతం లింక్ రోడ్డు మలుపు, జాతీయ రహదారి మలుపులో భారీ గోతులు పడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల గోతులను పూడ్చారు.. కానీ మళ్లీ వర్షాలకు గోతులమయం అయింది.

- వడలి నుంచి రామన్నపాలెం వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. వర్షం వస్తే పెద్దపెద్ద గోతుల్లో నీరు నిలిచి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా రహదారులను పూర్తి నిర్మాణం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వడలి నుంచి రామన్నపాలెం వెళ్లే రహదారి గోతులమయం



పెనుగొండ - సిద్ధాంతం రహదారి దుస్థితి



భీమవరం పోలీస్ బొమ్మ సెంటర్ రోడ్డు (ఇన్‌సెట్‌లో) జోడు కాల్వల వద్ద రహదారి దుస్థితి

కనీసం గోతులైన పూడ్చండి..


భీమవరంటౌన్ : భీమవరం పట్టణ పరిసర ప్రాంతాల్లోని రోడ్లు భారీ వర్షాలకు ధ్వంసమయ్యాయి. ఉండి రోడ్డు, జువ్వలపాలెరం స్టేట్ హైవే రోడ్డు, లోసరి రోడ్డు, పట్టణంలోని బైపాస్ రోడ్డు, ఉండి గేటు రోడ్డు, డీఎన్ఆర్ కళాశాల రోడ్డు, టూటౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్లు ఛిద్రంగా మారాయి. వర్షాలు తగ్గిన తరువాత కనీసం గోతులైనా పూడ్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



ఉండిలో ఆర్అండ్‌బీ రహదారిలో గొయ్యి

ఉండి-చేబ్రోలు హైవేకి తూట్లు

ఉండి : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఉండి-చేబ్రోలు జాతీయరహదారికి తూట్లుపడ్డాయి. ప్రయాణికులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. రహదారి పెచ్చులుపెచ్చులుగా ఊడిపోయి గోతులమయంగా మారుతోంది. భీమవరం నుంచి ఉండి మీదుగా పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు రోడ్డు, పాందువ్వరోడ్, ఆరేడు మీదుగా గణపవరం ఆర్టీసీ బస్సులు వెళ్తుంటాయి. అదేవిధంగా అక్కడ నుంచి తాడేపల్లిగుడెం, చేబ్రోలు, నారాయణపురం మీదుగా ఏలూరు బస్సులు, వాహనాలు వెళ్తుంటాయి. వర్షాకాలం పూర్తికాక ముందే ఈ రహదారి అధ్వానంగా మారింది. ఇక నుంచి కురిసే వర్షాలకు రహదారి మరింత దెబ్బతినే అవకాశం వుందని తక్షణమే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



వంకవారిగూడెం వద్ద కొట్టుకు పోయిన రహదారి

రహదారికి గండి..

జీలుగుమిల్లి : మండలంలోని వంకవారి గూడెం జీలుగుమిల్లి గ్రామాల మధ్య రహదారికి గండిపడడంతో రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తూరలు ఏర్పాటు చేసి రోడ్డు పోయించారు. శుక్రవారం వరద ఉధృతికి కల్వర్టు వద్ద తూరలు కొట్టుకు పోయి రోడ్డు మళ్లీ ధ్వంసమైంది. తాటియాకులగూడెం వద్ద జాతీయ రహదారిపై గోతుల్లో వాహనాలు వరద నీటిలో నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సూమారు రెండు గంటల పాటు వాహన చోదకులు గోతుల వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు

అలంపురం పెట్టింది పేరు

ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు..

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



కళాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న వర్మ, బొలిశెట్టి

పెంటపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు అలంపురం పెట్టింది పేరని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ అన్నారు. సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అలంపురం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు కొలనువాడ బంగార్రాజు నిర్మించిన శ్రీ సత్యసాయి రామానంద యోగి, రావమ్మ ఆధ్యాత్మిక కళాకేంద్రాన్ని శుక్రవారం మంత్రి వర్మ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రవాస భారతీయుడు బంగార్రాజు సత్య సాయిబాబా, తన తల్లిదండ్రుల పేరుతో కళాకేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అలాగే శ్రీ వెంకట రమణా సేవా చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడమే కాక ఉచితంగా ఆసుపత్రి నిర్మించి ఖరీదైన వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు సేవలు అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి బంగ్రారాజు, పెదకృష్ణంరాజు సేవలను అభినందిస్తూ ఆయనకు తన సహకారం ఉంటుందన్నారు. కొలనువాడ బంగార్రాజు మాట్లాడుతూ పుట్టిన గడ్డను, తల్లిదండ్రులను మరవకూడదన్నారు. ఆధ్యాత్మిక కళా కేంద్రం సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు మాట్లాడుతూ కళా కేంద్రంలో మొదటి ప్రాధాన్యత ఆధ్యాత్మిక కార్యక్రమాలకే ఉంటుందన్నారు. తన జీవితం సమాజ సేవకే అంకితమన్నారు. ఈ సందర్భంగా కళాకేంద్రం నిర్మాణం కోసం పనిచేసిన కార్మికులకు హెల్మెట్, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం మంత్రి వర్మ పెదకృష్ణంరాజు నూతనంగా ఆసుపత్రి, ఆలయం, తదితర వాటిని నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయితం శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, టీబీఆర్ సంస్థ చైర్మన్ తనుబుద్ధి భోగేశ్వరరావు, సర్పంచ్ ప్రగతి, సొసైటీ చైర్మన్‌లు దాసరి అప్పన్న, పారిచర్ల ప్రసాద్, వీర్ల కృష్ణ, బోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌పై పునఃపరిశీలనకు డిమాండ్

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లు కూడా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పునః పరిశీలించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. 2011 కంటే ముందు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులైన వారంతా అప్పటి నిబంధనల మేరకు ప్రామాణిక పరీక్ష అయిన ఉపాధ్యాయ ఎంపిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తర్వాతే టీచర్లుగా కొనసాగుతున్నారని ప్రభుత్వం పరి గణనలోకి తీసుకోవాలన్నారు. ఈ విధమైన నిర్ణీత అర్హత పరీక్షలో ఎంపికైన వారిని కూడా తాజాగా టెట్ రాయాలనడం సరికాదన్నారు. ఇన్‌సర్వీసు టీచర్లు టెట్ ఉత్తీర్ణత సాధించాలంటూ సుప్రీం తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలుచేసి ఉపాధ్యా యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశా రు.

గంజాయి స్వాధీనం..

పెనుగొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గంజాయిని కలిగి ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. దొంగరావిపాలెం పరిధిలో కొత్త వంతెన కింద ఉన్న ఏటిగట్టు వద్ద గంజాయి కలిగిన ఐదుగుర్ని అరెస్టు చేసి 5.63 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.




మృతి చెందిన ట్రాలీ లారీ డ్రైవర్

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన ట్రాలీ లారీ.. డ్రైవర్ మృతి

దెందులూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దెందులూరు జాతీయ రహదారిపై సత్యనారాయణపురం సమీపంలో ఆగి ఉన్న లారీని మరో ట్రాలీ లారీఢీ కొట్టడంతో డ్రైవర్ మృతి చెందగా క్లీనర్ గాయపడ్డాడు. రాజమండ్రి వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ సత్య నారాయణపురం వద్ద శుక్రవారం ఉదయం లారీ పాడవడంతో జాతీయ రహదారి పక్కన నిలుపుదల చేసి లారీని చెక్ చేస్తున్నాడు. అదే క్రమంలో తాడేపల్లిగూడెం వైపు నుంచి వెనుకగా విజయవాడ వైపు వస్తున్న ట్రాలీ లారీ బలంగా ఢీ కొట్టింది. దీంతో బీహర్ చెందిన ట్రాలీ లారీ డ్రైవర్ ఓం కుమార్(26) క్యాబిన్‌లో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు.ఆగి ఉన్న లారీని చెక్ చేస్తున్న క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో దెందులూరు ఎస్.ఐ. ఆర్.శివాజీ గాయాలైనా క్లీనర్‌ను అంబులెన్స్‌లో ఏలూరుకు తరలించి వైద్య సేవలందిస్తున్నారు. శవ పరీక్ష నిమిత్తం మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

స్కూల్ భవనం నుంచి జారిపడి విద్యార్థినికి తీవ్రగాయాలు



గాయపడిన విద్యార్థిని

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం తాళ్ల ముదునురుపాడు మున్సిపల్ హైస్కూల్ భవనం పైనుంచి పడి విదార్థినికి తీవ్రగాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జట్లపా లేనికి చెందిన కొమ్ము హాసిని పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ నెల 22న పాఠశాల భవనం నుంచి పడిపోయి బాలికకు తీవ్రగాయాలవడంతో తల్లిదండ్రులు హాసినిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పాఠశాల నిర్వహణాలోపం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎంఈవో వి.హనుమను సంప్రదించగా వర్షం కారణంగా జారిపడి ప్రమాదం జరిగినట్టు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారని అన్నారు.

నిర్వాసితుల కష్టాలు ఇంకెన్నాళ్లు..

- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో అధికారుల తీరుపై కరాటం ఫైర్
- భూమికి భూమి చూపించడంలో నిర్లక్ష్యం వీడాలంటూ హితవు



మీడియాతో మాట్లాడుతున్న కరాటం రాంబాబు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలంటే అధికారులకు 20 శాతం కమీషన్ ఇవ్వాలని కొందరు మధ్య వర్తులు రైతులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీ నిర్వాసితులు కరాటం రాంబాబును కలిసి వారి సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్వాసితులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇంకెంతకాలం వారి సమస్యలు పరిష్కరించకుండా ఉంటారని ఆయన ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులు తమ గ్రామాల్లో ఎంతో సంతోషంగా గడిపేవారన్నారు. తమ భూములిచ్చిన నిర్వాసితులు ఇప్పుడు కూలి పనులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఎంతో మంది రైతులకు లాభం చేకూరుతుందనే ఉద్దేశంతో ఆయా కమ్యూనిస్టు పార్టీలను ఒప్పించి వారి సహకారంతో గ్రామాలను ఖాళీ చేయించే విషయంలో తాను కూడా ప్రధాన పాత్ర పోషించినట్టు గుర్తు చేశారు.కానీ ఎన్ని ప్రభుత్వాలు మారినా నిర్వాసితులకు న్యాయం జరగడంలేదని వాపోయారు. చల్లావారిగూడెంలో నిర్వాసితులకు భూమికి భూమి పట్టాలిచ్చారని కనీసం వారి భూమి ఎక్కడ ఉందో ఇప్పటికీ చూపించలేదన్నారు. ఇలాంటి ఎన్నో నిర్వాసిత సమస్యలను పరిష్కరించాలంటే ప్రత్యేక సబ్ కలెక్టరును నియమించాలని డిమాండ్ చేశారు. సత్రం లక్ష్మణరావు, జనసేన మండల అధ్యక్షుడు ఆకుల రాకేశ్, చల్లావారిగూడెం నిర్వాసితులు పాల్గొన్నారు.

జడ్పీ పీఎఫ్ రుణాల విషయంలో మెలికలు పెట్టొద్దు

జడ్పీ సీఈవో శ్రీహరికి యూటీఎఫ్ వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యాధులకు సంబంధించిన ల్యాబ్ రిపోర్టులు, వైద్య చికిత్సలకయ్యే ఖర్చులకు సంబంధించి అంచనా వ్యయం(ఎస్టిమేషన్) ప్రతిపాదనలిస్తేనే వైద్య కారణాలపై జడ్పీ పీఎఫ్ రుణాల దరఖాస్తులను స్వీకరిస్తామనే అసమంజస నిబంధనలను జిల్లా పరిషత్ అధికారులు పెట్టడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ జిల్లా నాయకులు శుక్రవారం సాయంత్రం జడ్పీ సీఈవో ఎం.శ్రీహరికి వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి రంగమోహన్, కార్యదర్శి రాంబాబు స్థానిక మీడియాకు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జడ్పీ ప్రావిడెంట్ ఫండ్‌లో దాచుకున్న సొమ్ము(జడ్పీ పీఎఫ్)నుంచి గృహం కొనుగోలు, నవీకరణ, వైద్యచికిత్సలకు ఖర్చులు, ఇతర అవసరాలకు రుణాలు మంజూరు చేయాలని దరఖాస్తు చేస్తుంటారని వివరించారు. వీటిలో వైద్య అవసరాలనిమిత్తం రుణాల మంజూరు కోసం అందజేసే దరఖాస్తుతో పాటే వైద్యుని నివేదిక, చికిత్సకు ఎస్టిమేషన్లు, ల్యాబ్ రిపోర్టులు కూడా జతపర్చాలని షరతులు విధించడం రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేదన్నారు. ఈ షరతులు పూర్తిచేయని దరఖాస్తులను జడ్పీ నుంచి సీఎఫ్ఎంఎస్‌కు పంపడంలేదని వివరించారు. టీచర్లు దాచుకున్న పీఎఫ్ నుంచి వివిధ అవసరాలకు రుణాలు మంజూరుచేయడానికి ప్రభుత్వం నుంచి సర్క్యులర్ లేదా ఏవైనా షరతులు పెట్టిఉంటే వాటిని తమకు అందజేయాలని కోరారు. అర్థం పర్థంలేని నిబంధనలతో ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. యూటీఎఫ్ నాయకుల వినతి, ఆరోపణలపై జడ్పీ సీఈవో శ్రీహరిని వివరణకోరగా రుణాల మంజూరుకు ఇతరజిల్లాల్లో పాటిస్తున్న మార్గదర్శకాలను తెలుసుకుంటామన్నారు.ఇకమీదట ఇటువంటి సమస్యలు పునరావృతంకాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

ఎన్టీఆర్ జీవితం స్ఫూర్తిదాయకం



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న మంత్రి సారథి. చిత్రంలో ఎంపీ మహేష్, గన్ని

నూజివీడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, రాష్ట్ర గృహనిర్మాణ, పౌరసరఫరాల శాఖ మంత్రి కె.పార్థసారథి అన్నారు. శుక్రవారం నూజివీడు మండలం మర్రిబంధంలో ఎన్టీఆర్ విగ్రహా విష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. ఆయనతో పాటు ఏలూరు ఎంపీ పుట్టామహేష్‌కుమార్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల కాలంలో ఇప్పటికి లక్ష కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందించామన్నారు. అలాగే ప్రతిష్ఠాత్మకమైన డేటా సెంటర్‌ను తీసుకువచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిది అన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీమంత్రి నారాలోకేశ్ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి, ఐటీ అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను ఆటంక పరిచే ప్రతిపక్షం చెప్పే అబద్ధాలను ప్రజలు గ్రహించాలని కోరారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వం 14 లక్షల కోట్లు అప్పుపెట్టి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు తీసుకు రాకుండా ఆ డబ్బును వృథా చేసి రాష్ట్రాన్ని 20 ఏళ్ళు వెనక్కి తీసుకువెళ్ళిందన్నారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశం తరువాతే పేదల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఒకేపార్టీ సుదీర్ఘకాలం అధికారంలో ఉంటే ఆ రాష్ట్రం పారిశ్రామిక అభివృద్ధిలోనూ, సంక్షేమ కార్యక్రమాల అమల్లోనూ ముందు ఉంటుందని ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి కూటమి ప్రభుత్వానికి సుదీర్ఘకాలం పాటు అధికారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ పనులను పార్లమెంట్ సభ్యుడిగా తాను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఎన్టీఆర్ వల్లే రాష్ట్రాని కి, తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు వచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. మహిళలకు, బీసీలకు మెరుగైన అవకాశాలు, రాజకీయ పదవులు దక్కిన విషయాన్ని ఆయా వర్గాలు గుర్తించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ, విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చలిగాలికి వృద్ధుడి మృతి

ఆకివీడు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామంలో చలి గాలికి వృద్ధుడు ఎరిచర్ల మత్తయ్య(60) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మత్తయ్య ఇబ్బందులు పడుతున్నాడని, వైద్యం అందించినప్పటికీ మృతి చెందినట్లు తెలిపారు. భార్య గతంలోనే మృతి చెందిందని, కుమారులు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లడంతో చూసేవాళ్లు ఎవ్వరూ లేరన్నారు. దీంతో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. సర్పంచ్ నందమూరి ప్రకాష్ మృత దేహాన్ని పరిశీలించి అధికారులకు సమాచారం తెలియజేశారు. గ్రామ పెద్దలు ఎరిచర్ల ఛాంబర్లీన్, సందీప్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కుక్కునూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని ప్రజలు ఉపయోగించుకోవాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మల కిషోర్, ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రమ్ కిషోర్ అన్నారు. శుక్రవారం కుక్కునూరులో బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షులు తూము వెంకన్న, పీ.వెంకటలక్ష్మి, కృష్ణప్రసాద్, బాలకృష్ణ, వానపల్లి లక్ష్మణాచార్యులు, బొల్లు ప్రసాద్, రాధాకృష్ణ, వెంకట నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం

ఏలూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న సాయంత్రం ఏలూరు వైఎంహెచ్ఏ హాల్లో కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం నిర్వహించనున్నట్టు అధ్యక్షులు పెదపాటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గండికోట రాజేష్ కోశాధికారి కె.వి.సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత పౌరాణిక నటులు మండవ రాజగోపాలకృష్ణకు సత్కారం, అనంతరం గుప్తా ఫౌండేషన్ సహకారంతో రంగస్థల కళాకారులకు ఆర్థిక సత్కారం అందజేస్తామన్నారు.

పేదల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : రోషన్


కార్‌కేర్ సెంటర్ ప్రారంభిస్తున్న దృశ్యం

లింగపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పి-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని ధర్మాజీ గూడెంలో పి-4 పథకంలో భాగంగా దాతల ఆర్థిక సహకారంతో నిర్మించిన కార్ కేర్ సెంటర్, బేకరీలను ఎమ్మెల్యే రోషన్ ప్రారంభించారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ పేద కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కోరారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి: డీఎంహెచ్‌వో

లింగపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): లింగపాలెం పీహెచ్‌సీని శుక్రవారం ఏలూరు జిల్లా వైద్యాధికారి డాక్టర్ జాన్‌అమృతం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులతో వచ్చిన రోగులకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు, మందులు, వారి పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ల్యాబ్, మందులు, హెల్త్ రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించారు. వైద్య సిబ్బంది ప్రజలకు ప్రతి రోజూ అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు ఎక్కువగా కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా కుక్క, పాము కాటులకు అవసరమైన వ్యాక్సిన్‌లు, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్ నైమిషా, అర్జునరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు బాసటగా కూటమి ప్రభుత్వం : చిర్రి


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్రి

కొయ్యలగూడెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు బాసటగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కొయ్యలగూడెం ప్రకాశం కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ జాబ్ మేళా ఎంతో దోహదపడుతుందన్నారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ నిరు ద్యోగ యువతను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, గడ్డమనుగు రవి కుమార్, కార్పొరేషన్ డైరెక్టర్లు కృష్ణ, పెండ్యాల రమాదేవి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి, టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేష్, బీజేపీ మండలాధ్యక్షుడు గొలిశెట్టి వాసు పాల్గొన్నారు.

పేదల భూములకు బ్యాంకులు రుణాలివ్వాలి

జీలుగుమిల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పేదల సాగులో ఉన్న డిఫారం పట్టా భూములకు పంట రుణాలు మంజూరు చెయ్యాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గిరిజన గిరిజనేతర రైతులకు అన్ని బ్యాంకులు ఇటీవల వర్షాలకు నష్టపోయిన రైతులకు పంట రుణాలు ఇవ్వాలన్నారు. శుక్రవారం జీలుగుమిల్లిలో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం ప్రతీ రైతుకు రూ.2 లక్షల వరకు సొంత ధ్రువీకరణ ద్వారా బ్యాంకులు రుణం మంజూరు చెయ్యాలని, పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలన్నారు. ఈ నెల 30,31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరిగే ఏపీ రైతు సంఘం జిల్లా మహా సభలు విజయవంతం చెయ్యాలన్నారు. రైతు సంఘం నాయకులు బొడ్డు రాంబాబు, సి.హెచ్.సీతారామయ్య, సి.హెచ్.కొండలరావు, నాగదుర్గ, సూర్యారావు, శేషగిరిరావు, నరసింహారావు, వెంకటేశ్వరరావు ఉన్నారు.

పట్టిసీమకు భక్తుల తాకిడి



పోలవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం శుక్రవారం సందర్భంగా పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ సిబ్బంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు స్వామికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత జగన్‌కు లేదు


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ఎనలేనిదని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేని జగన్ దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కఛాన్స్ అంటూ ప్రజలను నమ్మించి మోసం చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కల్తీ మద్యానికి కేరాఫ్ అయిన జగన్‌మోహన్ రెడ్డికి సీఎం చంద్రబాబును విమర్శించే నైతికహక్కు లేదన్నారు. తాను అప్పట్లో మహిళా అధికారిణిపై దురుసుగా ప్రవర్తించానని కట్టుకథ అల్లారని మండిపడ్డారు. ఇప్పటికైన జగన్‌మోహన్‌రెడ్డి తెలివిగా వ్యవహరించాలని ప్రభాకర్ హితవు పలికారు.

ముంచేసింది

(5వ పేజీ తరువాయి)

నీటమునిగింది. రోడ్డుపై మూడు అడుగుల మేర నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిపివేశారు. పెనుమాకలంక, ఇంగి లిపాకలంక, నందిగామలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లంక గ్రామాల చుట్టూ నీరు పెద్దఎత్తున చేరుకుంది. ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తూ కొల్లేరులో భారీఎత్తున నీరు చేరుతుంది.

ఉధృతంగా గుండేరు వాగు :దెందులూరు మండలంలో గుండేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సత్యనారాయణపురం వద్ద డ్రెయిన్ ఉధృతితో గ్రామంలోకి రాకపోకలు నిలిచిపోవడంతో వీఆర్వోలు భద్రతా చర్యలు తీసుకున్నారు.

పెదవేగిలో నీట మునిగిన పంట పరిశీలన..

పెదవేగి: మండలంలో 5600 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా 160 ఎకరాల్లో పంట నేలవాలిందని పెదవేగి మండల వ్యవసాయాధికారి సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. వర్షాల కారణంగా పాడైన పంటలను ఏడీఏ ఇ.అనిలాకుమారి శుక్రవారం పరిశీలించారు. ముందూరులో నేలవాలిన పంటలను పరిశీలించిన ఆమె సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.శ్రీనివాసరావు, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలు గంగరాజు, భారతి పాల్గొన్నారు.

తెరపైకి జిల్లా పునర్విభజన అంశం

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ఉంది. దీంతో ఈ మూడు మండలాలతో పాటు ద్వారకాతిరుమలన కలిపి గోపాలపురం నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో కలిపే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఆయా మండలాల్లో విలేకరుల అసోసియేషన్ల నుంచి సంతకాల సేకరణ జరగడం కొసమెరుపు. ప్రజల అభిప్రాయాలను మంత్రివర్గ ఉపసంఘం ముందుంచి, తర్వాత ప్రభుత్వం పబ్లికేషన్ ఇచ్చి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు సమాచారం.

ప్రజల అభిప్రాయంపై సమాచార సేకరణ..

నూజివీడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పరిధిలోని నూజివీడు నియోజకవర్గాన్ని విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాలో కలపాలనే అంశంపై శుక్రవారం నూజివీడు రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి సమాచార సేకరణ చేపట్టారు. నూజివీడు రూరల్, అర్బన్, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లోని రెవెన్యూ అధికారులు ప్రజాభిప్రాయం సేకరించి జిల్లా ఉన్నతాధికారులకు అందించారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఏకకంఠంతో ఎన్టీఆర్ జిల్లాలో నూజివీడును కలపాలని స్పష్టం చేశారు.

బ్లాక్‌లో సబ్సిడీ సిలిండర్లు..

హోటళ్లు, టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వాణిజ్య సిలిండర్ల వాడకం నామమాత్రమే

చర్యలు తప్పవంటూ అధికారుల హెచ్చరికలు


హోటల్‌లో ఉన్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్(ఫైల్)

లింగపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పేదల ఇంట్లో వారి గృహావసరాలకు ఉపయోగించే రాయితీ సిలిండర్‌లు బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గృహావసరాలకు వివిధ పథకాల ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తోంది. అంతే కాకుండా వాణిజ్య అవసరాలకు కూడా గ్యాస్ సిలిండర్‌లను అందిస్తోంది. ఈ గ్యాస్ సిలిండర్లను ఆయా అవసరాల మేరకు పంపిణీ చేసేందుకు కొన్ని గ్యాస్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించింది.ఈక్రమంలో గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించకూడదనే నిబంధన ఉంది. ఎక్కడా ఈ నిబంధన ఆమలు కావడం లేదు. హోటల్స్ ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్‌లు, టీ షాప్‌ల్లో సబ్సిడీ గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లనే వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. కొన్ని చోట్ల నామమాత్రంగా ఒక వాణిజ్య సిలిండర్‌ను బయటకు చూపిస్తూ లోపలంతా గృహావసరాలకు వినియోగించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లనే ఉపయోగిస్తున్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న వందలాది హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్‌సెంటర్‌లు, టీ షాప్‌లకు కొందరు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా తమ ఇష్టానుసారంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు పట్టించుకునేవారు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారీతిగా వాడుతున్నారనే విమర్శలున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం..

గృహావసరాలకు వినియోగించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎవరైనా అక్రమంగా గ్యాస్ సిలిండర్‌లను వినియోగిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటాం.

ఎం.దుర్గాప్రసాద్, డీటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లై, లింగపాలెం

గిరిజనులకు ఆధార్ కష్టాలు

» అధికారుల తీరుపై ఆగ్రహం


ఆధార్ అప్‌డేట్ కోరుతున్న కొండరెడ్లు

బుట్టాయగూడెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులోని ఇబ్బందులతో కొండరెడ్డి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోర్సవారిగూడెం పంచాయతీ మోతుగూడెం కాలనీకి చెందిన గురుగుంట్ల లచ్చిరెడ్డి కుమారుడు కిరణ్, కెచ్చెల చిన్నయ్య కుమార్తె ఐశ్వర్యల పుట్టిన తేదీ ఆధార్‌లో తప్పుగా నమోదైంది. ఆధార్‌లో తప్పులను సరిచేయాలంటూ గత మే నెలలో నోటరీ చేయించి తహసీల్దార్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. ఐదు నెలలుగా అధికారులు స్పందించలేదు, అంతే కాకుండా దరఖాస్తు గడువు ముగిసిందని మళ్లీ నోటరీ చేయించి దరఖాస్తు చేయాలని చెప్పడంతో తల్లిదండ్రులు, వీడీఎస్‌యూ నాయకులు ఇ.భూషణం, బి.వినోద్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నోటరీకి వచ్చే డబ్బుల కోసం ఇబ్బందులు పెట్టడం సరికాదని, అధికారుల నిర్లక్ష్యం పిల్లల చదువుల పట్ల శాపంగా మారాయని, అనేక గ్రామాల్లో కొండరెడ్లకు ఆధార్ అప్డెట్ కాలేదని, పేర్లు మార్పు, పుట్టిన తేదీల్లో తప్పులు ఉన్నాయన్నారు. ఆధార్ అప్‌డేట్ కాకపోతే ఆశ్రమ విద్యాలయాల్లో చదువులు మాత్రమే చెప్పగలమని భోజనం పెట్టలేమని వసతి గృహాల హెచ్‌ఎంలు, వార్డెన్లు చెప్పడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ హెచ్‌ఎం ధ్రువీకరించిన స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా జరిగిన తప్పులను సరిచేయాల్సి ఉండగా నోటరీ చేయించాలనడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని, పిల్లల చదువులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

పోలియో వ్యాక్సిన్లు వేయించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ సభ్యులు

దెందులూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):పోలియో వ్యాక్సిన్ అభివృద్ధి చేసిన డాక్టర్ జోనాస్ సాల్క్ పుట్టిన రోజును ప్రపంచ పోలియో నివారణ దినంగా నిర్వహిస్తున్నట్టు దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శుక్రవారం దెందులూరు బీఆర్‌అండ్‌డీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీలో ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం నిర్వహించారు. పోలియోను అంతం చేయడం కోసం ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేయించాలని అవగాహన కలిస్తూ ర్యాలీ చేసి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

● జంగారెడ్డిగూడెం: పోలియో నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పెనుమర్తి సురేశ్, ప్రవల్లిక కోరారు. ప్రపంచ పోలియో నివారణ దినం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు, విద్యార్థులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలంటే రూ.11 వేల కోట్లు ఖర్చవుతుందని, రోటరీ ఒక్కటే ఆ ఖర్చును భరిస్తోందని సురేశ్ తెలిపారు. రోటరీ ప్రతి నిధులు పాలపర్తి శ్రీనివాస్, దాకారపు కృష్ణ, టీపీఏ తారకం, గణిత ప్రసాద్, ఎ.ఎస్.ఐ. సంపత్, స్టేషన్ రైటర్ తామా బాబూరావు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఏలూరుటూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భక్తుల సంకల్పం బలంగా ఉంటే భగవంతుడు ప్రసన్న మవుతాడు అనడానికి ఎన్నో నిదర్శనాలున్నాయని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆదివారపుపేటలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. అనంతరం ఆదివారపుపేటలో ఉన్న షిర్డీ సాయి ప్రేమమందిర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ షేక్ నూర్జహాన్, ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ షిర్డీసాయి ప్రేమ మందిర్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, సాయిబాబా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం,డిప్యూటీ మేయర్ వందనాల దుర్గాభవాని శ్రీనివాస్, కార్పొరేటర్ ఏఎస్. భాష, రామ్‌లక్ష్మణ్, నాగశేషు పాల్గొన్నారు.

ధాన్యమందిరం ప్రారంభం



ఏలూరు టూటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వన్ టౌన్‌లో రంగ్రేజీల మఠం ఆధ్వర్యంలో ధ్యానమంది రాన్ని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు ప్రారంభించారు. ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇడా చైర్మన్ శివప్రసాద్, నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, ఈవో నాగేశ్వర రావు, రంగ్రేజీల కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ..

ఏలూరుటూటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దక్షిణపు వీధిలో నిర్వహిస్తున్న సర్వజన సమ్మేళన జాతర పోస్టర్‌ను మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు ఆవిష్కరించారు. సర్వజన సమ్మేళన జాతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సన్నాయిమేళం, వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 31న జరిగే ముడుపులు కట్టే కార్యక్రమానికి హాజరుకావాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను బొలేరో వాహనంలో తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. పెదపాడు మండలం తోటగూడెం శివారులో బొలేరో వాహనాన్ని పట్టుకున్నట్టు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. చికెన్ వ్యర్థాలు, వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అంతర్జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ఏలూరు టూటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ గ్రంథాయల దినోత్సవం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శి ఎం. శేఖర్ మాట్లాడుతూ గ్రంథాలయాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ బి.టి.సందీప్ కుమార్, రమేశ్, వైవీసాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలోని తొలి శుక్రవారం కావడంతో సత్రంపాడులోని అంబికాదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి పంచ హారతులిచ్చి భక్తజనానికి దర్శనమిచ్చారు. ఆలయ సహాయ అర్చకులు కపిలి శివ శంకర శర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. ఆలయ మేనేజర్ ఓలేటి మల్లికార్జునరావు, సిబ్బంది భక్తులకు ఈ సందర్భంగా మహా అన్నప్రసాద వితరణను నిర్వహిస్తూ సేవలందించారు.

ఊరెళ్లి వచ్చేసరికే ఇంటిని దోచేశారు

పెదవేగి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఊరెళ్లి వచ్చే సరికే ఇంట్లో చోరీ జరిగింది. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కవ్వగుంట గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కాట్రు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 21న విజయవాడ వెళ్లి 23న ఇంటికి తిరిగొచ్చారు. ఇంటికి తిరిగొచ్చిన ఆయన ఇంట్లో ఐదు కాసుల బంగారు ఆభరణాలు, రూ.7వేల నగదు పోయినట్లు గుర్తించి, ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కనకదుర్గాంబకు నాగదేవత అలంకారం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బావిశెట్టివారిపేటలోని దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని కనకదుర్గాంబ అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకులు యడవల్లి శ్రీహరిశర్మ శనివారం నాగులచవితి సందర్భంగా అమ్మవారిని నాగదేవత అలంకారం జరిపి భక్త జనానికి దర్శనమిచ్చారు.

భయపెడుతున్న వర్షాలు

» వరి వెన్ను విరుస్తున్న వరుణుడు


వర్షాలతో ముంపుబారిన పడిన వరిచేలు

ఏలూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు ఈ ఏడాది కూడా కష్టాలు తప్పడం లేదు. సీజన్ ప్రారంభంలో కాస్త ఆలస్యంగా వచ్చిన వానలు ఆ తరువాత ఊపందుకోవడంతో సాగు పనులు ముమ్మరంగా సాగాయి. పంటలు కూడా ఏపుగా పెరిగాయి. ఈసారి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని భావించిన రైతులకు ప్రస్తుతం పడుతున్న వానలు వారి గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. పొట్టపోసుకునే దశలో వరి నేలవారుతుండటంతో అన్నదాతలు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ వర్షాలతో పంటలకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండ లేకపోవడం, చల్లని వాతావరణం ఏర్పడటంతో పంటలకు తెగుళ్లు సోకే ప్రమాదముందని రైతులు వాపోయారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెదపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటి నుంచి అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.సూర్యచంద్రరావు తెలిపారు. సైబర్ నేరాలు - వాటి ప్రభావంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీఐడీ డీఎస్పీ సైబర్ క్రైమ్ డాక్టరు రవికిరణ్ మాట్లాడుతూ ఇటీవల పదవీ విరమణ చేసిన వారిని, పెద్దలు, వృద్ధులను లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, డిజిటల్ అరెస్టుల పేరుతో భయపెడుతున్నారన్నారు.అధిక వడ్డీలు, ఉద్యోగ ప్రకటనల పేరుతో ఆశ కల్పించే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు పాల్పడితే 1930 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.కళాశాల ఎండీ సాయి రోహిత్, ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.మురళీధరరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ దాస్, వల్లి పద్మ పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న సమితి సభ్యులు

అంబేడ్కర్ సేవా సమితి సాయం

ద్వారకాతిరుమల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధిత బాలుడి కుటుంబానికి మండలంలోని పంగిడిగూడెం అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు రూ.50 వేలు విరాళం సేకరించి ఇచ్చి తమ ఔదార్యం చాటారు. దెందులూరు మండలం కొవ్వలికి చెందిన ఊదరకొండ నానాజీ, మనీషాల కుమారుడు ఇటీవల కాన్సర్ వ్యాధి బారిన పడ్డాడు.ఈక్రమంలో ఆ చిన్నారి విజయవాడలో చికిత్స పొందుతున్నాడు. రూ.15లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో సేవా సమితి వారిని సాయం అడిగారు. దీంతో సభ్యులు మానుకొండ శ్రీను, సురేష్, కొదము కిశోర్, కాలి అశోక్, మద్ది ఆనంద కిషోర్, పత్తిపాటి సురేష్, గోగులమూడి సోమయ్య, అశోక్‌లు విరాళం సేకరించి అందజేశారు.

సింగగూడెంలో రాజ్యాంగ దినోత్సవం

లింగపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సింగగూడెం ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు కె.రామారావు, జె.రవీంద్రల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలల నుంచి 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో రంగాపురం పాఠశాలలో టెన్త్ చదువుతున్న కె.వంశిక, 9వ తరగతి చదువుతున్న ఎస్.కె.హసీనా, ధర్మాజీగూడెం నుంచి 9వ తరగతి చదువుతున్న జి.హిమబిందులు విజేతలుగా నిలిచారని వారు ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే చింతలపూడి నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవోలు తెలిపారు. హెచ్ఎం బి.శ్రీధర్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


చెత్తసేకరణను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీహరి

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

లింగపాలెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా అన్ని పంచాయతీలలో శానిటేషన్ చెయ్యాలని పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులను చేయించడంపై దృష్టి సారించాలని జడ్పీ సీఈవో శ్రీహరి అన్నారు. లింగపాలెంలో పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డిప్యూటీ ఎంపీడీవో ఎసుందరితో కలిసి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామాలలో తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించాలన్నారు. మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సుగుణరాజు, రాజు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్‌పై అవగాహన

ఏలూరుసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్బీఐ గుర్తింపు పొందిన స్వీయ నియంత్రణ సంస్థ ఎంఎఫ్ఐఎన్ ఆధ్వర్యంలో జిల్లాలో మైక్రో ఫైనాన్స్ అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామీణ కుటుంబాల్లో ఆర్థిక సాక్షరత పెంపు, నియంత్రిక ఆర్థిక సేవలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఎంఎఫ్ఐఎన్ ఉపాధ్యక్షుడు పీఎం కమలేష్ మాట్లాడుతూ సభ్యసంస్థలన్నీ ఆర్‌బీఐ నియంత్రితమైనవేనని, బాధ్యతాయుత రుణ ప్రవర్తన పాటించి, సందేహాలు /ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ 1800-102-1080ను ఉపయోగించుకోవాలని సూచించారు.ఎల్‌డీఎం నీలాద్రి, ఏలూరు ఎస్ఐ దుర్గాప్రసాద్, నాబార్డ్ డీడీఎం, అనిల్ కాంత్ పాల్గొన్నారు.

వచ్చే నెలలో రాజకీయ శిక్షణ తరగతులు

ఏలూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు సీతారామ భర్తీయా కల్యాణ మండపంలో నవంబరు 1 తేదీ నుంచి 4 తేదీ వరకు ఇఫ్టూ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సన్నాహక సమావేశం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా కార్మికుల పక్షాన ఇఫ్టూ పోరాటం చేస్తుందన్నారు. రాజకీయ శిక్షణ తరగతులకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

పెదపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పెదపాడు హైస్కూల్లో విద్యార్థులకు సమాజంలో నైతిక విలువలు ఎలా పెంపొందించాలనే అంశంపై వ్యాస రచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ బహుమతులు అందజేశారు. హెచ్.ఎం. పి. వెంకటేశ్వరరావు, శక్తిటీం సభ్యులు పాల్గొన్నారు.



మద్యం షాపుల పరిశీలన

పోలవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం షాపులను ఏపీ ట్రైకార్ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం కొనుగోలు చేసే ముందు ఏపీ ఎక్సైజ్ శాఖ రూపొందించిన సురక్ష యాప్ ఉపయోగించి మద్యం బాటిల్ నాణ్యతను తెలుసుకోవాలన్నారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ

చింతలపూడి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు చింతలపూడి పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ నిరసనలో జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈ ఓటర్ల జాబితా అవకతవకలపై సంతకాల సేకరణ చేస్తున్నామని, ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, జె.కోటిరెడ్డి,విస్సంపల్లి సుందరరావు, ఎం.బాబూరావు, యేసుబాబు, బి.సుబ్బారావు, టి.రమేశ్, జి.మురళీ, ఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు.

పంటలపై జాగ్రత్త వహించాలి

చింతలపూడి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల ఈ సీజన్‌లో పండించే వరి, మొక్కజొన్న, మిరప, పత్తి, మినుము, పెసర వంటి పంటల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. పంటలు ముంపుకు గురైతే అదనపు నీటిని తొలగించి నీటి యాజమాన్యం పాటించాలన్నారు.పంట పెరుగుదల దశలో ఉంటే యూరియా, పొటాష్ తగిన మోతాదులో వినియోగించాలన్నారు. మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, వీటిపై సస్యరక్షణ చర్యలు తీసుకుని పంటలను కాపాడుకోవాలన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన

ఏలూరు అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో విద్యార్థినులకు క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆశ్రం వైద్య కళాశాల వైద్యురాలు డాక్టర్ సింధు మాట్లాడుతూ ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. మహిళల్లో ప్రధానంగా బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని, రెగ్యులర్ హెల్త్ చెకప్, ఆరోగ్యకర జీవనవిధానం, మానసిక ప్రశాంతత ముఖ్యమన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విష్ణు మోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, మహిళా సాధికారత విభాగం ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాతూరి అంబేడ్కర్

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్థానిక సొసైటీ డైరెక్టర్ పాతూరి అంబేడ్కర్‌ను నియమించినట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేశ్ తెలియజేశారు. స్థానిక మాల మహానాడు కార్యాలయంలో ఆ సంఘ లీగల్ అడ్వైజర్ తొర్లపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం సమావేశంలో నల్లి రాజేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాల మహానాడులో చేరారు. మాల మహానాడు చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొండ్రు నాగరాజు, పట్టణ అధ్యక్షుడిగా వెంపల రాజు, ప్రధాన కార్యదర్శిగా సింగవరపు మనోజ్‌లను నియమించినట్లు రాజేశ్ తెలిపారు. నూతనంగా నియమితులైన వారికి పత్రాలు అందజేసి అభినందించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నిడమర్రు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి రాజ్యాంగ స్ఫూర్తి అనుసరించి ఉత్తమ పౌరులుగా జీవించాలని నిడమర్రు మండల విద్యాశాఖాధికారి టి.అనూరాధ అన్నారు. శుక్రవారం నిడమర్రు మండల వనరుల కేంద్రంలో మండల స్థాయి వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.ఆనందిత, జి.కీర్తన, జి.జి.ఎస్.ఎస్.ప్రసాద్‌లు ఎంపికయ్యారు. మండల విద్యాశాఖాధికారి-2 వై.శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి

కామవరపుకోట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన, అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయని సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాలనీల్లో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని, రాకపోకలు సాగించేందుకు ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. రాత్రివేళల్లో గమ్యస్థానాలకు చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన రహదారులను అభివృద్ధి చేయాలన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

చాట్రాయి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారావుపాలెం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ పుల్లారావు అధ్యక్షతన ఉపాధి గ్రామసభ నిర్వహించారు. టీఏ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి కూలీలందరికి 100 రోజులు పనులు కల్పించేలా అవసరమైన పనులను ప్రతిపాదించాలని కోరారు. గ్రామంలో పలు పనులను ప్రజాప్రతినిదులు, కూలీలు ప్రతిపాదించగా ఉపాధి సిబ్బంది నమోదు చేశారు. ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు తాళ్లూరి ప్రసాద్ పాల్గొన్నారు.



రహదారిపై విరిగిన కొమ్మ

కలిదిండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సంతోషపురంలో శుక్రవారం గుర్వాయిపాలెం - పెదలంక రహదారిపై చెట్టు కొమ్మ విరిగి పడింది. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు చెట్టు కొమ్మను తొలగించారు.



యుఎన్‌వో ఆకారంలో ఒదిగిన విద్యార్థులు

ఘనంగా ఐక్యరాజ్య సమితి దినోత్సవం

నూజివీడు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని నూజివీడు గౌతమి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ శోభనాద్రి మాట్లాడుతూ ప్రపంచ శాంతి పరిరక్షణలో ఐక్యరాజ్యసమితి పాత్రను, ఆశయాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యూఎన్‌ఓ ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు శివసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వివిధ దేశాల జెండాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆగిరిపల్లి: చొప్పరమెట్ల కేకేఆర్ హ్యాపీ వ్యాలీ స్కూల్‌లో ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ మంజునాథ్ తెలిపారు. విద్యార్థులు ప్రపంచ దేశాల ప్రతినిధులుగా వ్యవహరిస్తూ ప్రపంచ ఐక్యత, శాంతి, సహకారంపై చర్చలు జరిపి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారన్నారు.

లాల్వ డ్రెయిన్‌లో పూడిక తొలగింపు



కలిదిండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ ఆధ్వర్యంలో కలిదిండిలో లాల్వ డ్రెయిన్‌లో పూడికను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 23న పొంగిన లాల్వ డ్రెయిన్ శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలిదిండి-కైకలూరు రహదారిలో లాల్వ డ్రెయిన్‌లోని తూములో పూడికను తొలగించటంతో ఎగువ నుంచి వచ్చే వరద నీరు దిగువ ఉన్న ఉప్పుటేరులోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. సానారుద్రవరం, వెంకటాపురం, గోపాలపురం గ్రామాల్లో ముంపు బారిన పడిన వరి పొలాల్లో నీరు లాల్వ డ్రెయిన్‌లోకి పోవటంతో వరి పొలాలు తేరుకుంటున్నాయి. కోరుకొల్లు, కలిదిండి డీసీ ఛైర్మన్లు పేటేటి సత్యనారాయణ, ముద్దం భోగేశ్వర రావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ చౌదరి, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మల్లికార్జున రావు, డ్రెయినేజీ ఏఈఈ రామిరెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

చనుబండలో జ్వరాలపై ఇంటింటి సర్వే




చాట్రాయి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జ్వరాలపై ఇంటింటి సర్వే, వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న బాలుడికి డెంగీ లక్షణాలు ఉన్నట్టు ప్రచారం జరగటంతో ఈ సర్వే చేపట్టారు. జిల్లా సర్వైలెన్స్ అధికారి నరేంద్ర కృష్ణ, నూజివీడు సబ్ యూనిట్ ఆఫీసర్ యల్లమంద, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి సర్వేని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ విజయవాడలో చికిత్స పొందుతున్న బాలుడికి డెంగీ నిర్ధారణ కాలేదని, గ్రామంలో 189 గృహాలు సర్వే చేయగా ఒక్క జ్వరం కేసు కూడా నమోదు కాలేదని, వైద్య శిబిరంలో 21 మందికి సాధారణ వ్యాధులకు చికిత్సలు అందించామన్నారు. అధిక వర్షాలు కురుస్తున్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమల పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వేడి ఆహార పదార్థాలనే భుజించాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందాలని సూచించారు.

రాజధాని నిర్మాణానికి ముస్లింల విరాళాలు



ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని నిర్మాణానికి తమ వంతు విరాళాలిచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషికి సహకరించాలన్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి పిలుపునకు ముదినేపల్లి మసీదు కమిటీ సభ్యులు, ముస్లింలు స్పందించారు. శుక్రవారం మసీదులో నమాజ్ అనంతరం వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముస్లింలు ఏపీసీఆర్‌డీఏ ఖాతాకు క్యూఆర్ కోడ్ ద్వారా తమ విరాళాలు సుమారు రూ. 15 వేలు పంపారు. అమరావతి రాజధాని నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు.

వినోద్ చేయూత



ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో ఈ నెల 22న షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై నిరాశ్రయురాలైన మడ్డి నరసమ్మకు శుక్రవారం ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ముంచేసింది

(5వ పేజీ తరువాయి)

నీటమునిగింది. రోడ్డుపై మూడు అడుగుల మేర నీరు ప్రవహించడం తో రాకపోకలు నిలిపివేశారు. పెనుమాకలంక, ఇంగి లిపాకలంక, నందిగామలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లంక గ్రామాల చుట్టూ నీరు పెద్దఎత్తున చేరుకుంది. ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తూ కొల్లేరులో భారీఎత్తున నీరు చేరుతుంది.

ఉధృతంగా గుండేరు వాగు

దెందులూరు మండలంలో గుండేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సత్యనారాయణపురం వద్ద డ్రెయిన్ ఉధృతితో గ్రామంలోకి రాకపోకలు నిలిచిపో యాయి. గ్రామస్తులు డ్రెయిన్ దాటకుండా వీఆర్వో లు చర్యలు తీసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



ముదినేపల్లిలో వర్షాలకు ధ్వంసమైన గురజ రోడ్డు



లాల్వ డ్రెయిన్‌పై తాత్కాలిక రహదారికి గండిపడిన దృశ్యం

గజానికో గుంత

భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఈ మేరకు పలు ప్రాంతాల్లోని రోడ్లు గజానికో గొయ్యి మాదిరిగా తయారయ్యాయి. కొన్ని రోడ్లు కనీసం నడిచి కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. కొన్ని రహదారుల పరిస్థితిపై ఆంధ్రజ్యోతి కథనం.

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)భారీ వర్షాలకు ముదినేపల్లి - గురజ రహదారి ధ్వంసమైంది. వర్షపునీరు గోతుల్లో నిలబడటంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రధాన రహదారి ప్రమాదకరంగా ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికార్లు గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలతో పాటు, ఆసుపత్రులకు వెళ్ళే రోగులు, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

కలిదిండి: లాల్వ డ్రెయిన్‌పై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి వరద ఉధృతికి కోతకు గురై పెద్ద గండి పడింది. దీంతో కలిదిండి, కైకలూరు వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. కలిదిండి నుంచి వేమవరప్పాడు వయా తామరకొల్లు మీదుగా కైకలూరుకు వాహనాలను మ ళ్లిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ అనిల్ కుమార్, ఏఈఈ భాస్కర్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించి వరద ఉధృతి తగ్గిన తర్వాత రహదారి పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామన్నారు. పాతవంతెనపై విద్యుత్ స్తంభా లు ఏర్పాటు చే సి కాలిదారి ఏర్పాటు చేస్తామన్నారు.

ముసునూరు: రమణక్కపేట పంచాయతీలో ఆర్‌సీఎం చర్చి నుంచి దళితవాడకు వెళ్ళే రహదారి అధ్వానంగా ఉంది. దీంతో విద్యార్థులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీరు రోడ్డులో ఉన్న గుంతల్లో చేరడంతో విద్యార్థులు జారిపడి గాయపడడంతోపాటు పుస్తకాల బ్యాగ్‌లు సైతం నీటిలో పడిపోతున్నాయని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారని పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం గ్రావెల్ వేసి ఈ రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



రమణక్కపేట ఎస్సీ కాలనీ రహదారిలో గుంతల రోడ్డుతో విద్యార్థుల పాట్లు



చింతలవల్లి సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, స్థానికులు

సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలని ఆందోళన

ముసునూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవల్లి పంచాయతీ వైసీపీ సానుభూతిపరుడైన సర్పంచ్ పిల్లి సత్యనారాయణ చెక్ పవర్‌ను వెంటనే రద్దు చేయాలని ఉప సర్పంచ్ పెద్దినేని విజయలక్ష్మి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు కాటేపల్లి సురేంద్రబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద పాలకవర్గ సభ్యులు, నాయకులు, స్థానికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పంచాయతీలో జరిగిన అవినీతిపై ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, ఈవోపీఆర్డీ బీవీ సత్యనారాయణ విచారణ చేసి సుమారు రూ. 30 లక్షలు నిధులు దుర్వినియోగం అయినట్లు తేల్చారన్నారు. అయితే వారం రోజులు క్రితం ఈ విషయాన్ని మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళామని, దీనిపై స్పందించిన మంత్రి సర్పంచ్ చెక్ పవర్‌ను వెంటనే రద్దు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారని చెప్పారు. అయితే మంత్రి ఆదేశాలను సైతం అధికారులు పట్టించుకోకుండా, వారం రోజులు గడిచినా చర్యలు తీసుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయకుండా ఈవోపీఆర్డీ కాలయాపన చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా మంత్రి ఆదేశాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. జోనుబోయిన రాంబాబు, ఏనుగుదాటి రాజు, మందపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెరపైకి జిల్లా పునర్విభజన అంశం

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ఉంది. దీంతో ఈ మూడు మండలాలతో పాటు ద్వారకాతిరుమలను కలిపి గోపాలపురం నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో కలిపే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఆయా మండలాల్లో విలేకరుల అసోసియేషన్ల నుంచి సంతకాల సేకరణ జరగడం కొసమెరుపు. ప్రజాభిప్రాయాలను మంత్రివర్గ ఉపసంఘం ముందుంచి, తర్వాత ప్రభుత్వం పబ్లికేషన్ ఇచ్చి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు సమాచారం.

జిల్లా మార్పుపై సమాచార సేకరణ

నూజివీడు: ఏలూరు జిల్లా పరిధిలోని నూజివీడు నియోజకవర్గాన్ని విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాలో కలపాలనే అంశంపై శుక్రవారం నూజివీడు రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి సమాచార సేకరణ చేపట్టారు. నూజివీడు రూరల్, అర్బన్, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లోని రెవెన్యూ అధికారులు ప్రజాభిప్రాయం సేకరించి జిల్లా ఉన్నతాధికారులకు అందించారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఏకకంఠంతో ఎన్టీఆర్ జిల్లాలో నూజివీడును కలపాలని స్పష్టం చేశారు.

ఎన్టీఆర్ జీవితం స్ఫూర్తిదాయకం

- 16 నెలల్లో రూ. లక్ష కోట్ల సంక్షేమం అందించిన కూటమి
- మంత్రి పార్థసారథి
- మర్రిబంధంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి. చిత్రంలో ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

నూజివీడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, రాష్ట్ర గృహనిర్మాణ, పౌరసరఫరాల శాఖ మంత్రి కె.పార్థసారథి అన్నారు. శుక్రవారం నూజివీడు మండలం మర్రిబంధంలో ఎన్టీఆర్ విగ్రహా విష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. ఆయనతో పాటు ఏలూరు ఎంపీ పుట్టామహేష్‌కుమార్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల కాలంలో ఇప్పటికి లక్ష కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందించామన్నారు. అలాగే ప్రతిష్ఠాత్మకమైన డేటా సెంటర్‌ను తీసుకువచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిది అన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీమంత్రి నారాలోకేశ్ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి, ఐటీ అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను ఆటంక పరిచే ప్రతిపక్షం చెప్పే అబద్ధాలను ప్రజలు గ్రహించాలని కోరారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వం 14 లక్షల కోట్లు అప్పుపెట్టి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురాకుండా ఆ డబ్బును వృథా చేసి రాష్ట్రాన్ని 20 ఏళ్ళు వెనక్కి తీసుకువెళ్ళిందన్నారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశం తరువాతే పేదల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఒకేపార్టీ సుదీర్ఘకాలం అధికారంలో ఉంటే ఆ రాష్ట్రం పారిశ్రామిక అభివృద్ధిలోనూ, సంక్షేమ కార్యక్రమాల అమల్లోనూ ముందు ఉంటుందని ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి కూటమి ప్రభుత్వానికి సుదీర్ఘకాలం పాటు అధికారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ పనులను పార్లమెంట్ సభ్యుడిగా తాను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఎన్టీఆర్ వల్లే రాష్ట్రానికి, తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు వచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. మహిళలకు, బీసీలకు మెరుగైన అవకాశాలు, రాజకీయ పదవులు దక్కిన విషయాన్ని ఆయా వర్గాలు గుర్తించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ, న్యూరాలజీ ఉచిత ఓపీ సేవలు

ఏలూరు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ, న్యూరాలజీ ఉచిత ఓపీ సేవలను ఈనెల 25 నుంచి రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. విజయవాడలో ఉన్న అను న్యూరో కార్డియాక్ ఆసుపత్రి వారి సహకారంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ ఓపీ విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. అవసర మైన వారికి ఈసీజీ, టూడీ ఇకో పరీక్షలను ఉచితంగా చేయనున్నారు. శనివారం ఉదయం ఓపీ సేవలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి, ముఖ్య అతిథులుగా ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏలూరు ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి పాల్గొననున్నారు.

అమరవీరుల సేవలను స్మరించుకుందాం

నూజివీడు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల సేవలను స్మరించుకొని వారికి సముచిత గౌరవాన్నిచ్చి వారి త్యాగనిరతిని విద్యార్థులకు వివరించి దేశభక్తిని పెంపొందించాలని నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నూజివీడులో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ వ్యవస్థ ప్రాముఖ్యత, పనితీరును వివరించారు. పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

చాట్రాయి: పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో ఎస్ఐ డి. రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం 'లైంగిక దాడుల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాస రచన, డిబేటింగ్ పోటీలు నిర్వహించారు. ఏఎస్సై గఫార్ మాట్లాడుతూ పోలీసులు ప్రజల రక్షణ కోసం నిరంతరం పాటు పడుతుంటారని, ప్రజలు సహకరించాలని కోరారు.



బృందగానంలో రాష్ట్రస్థాయి ద్వితీయ స్థానం బహుమతి అందుకుంటున్న కైకలూరు విద్యార్థినులు

కళా ఉత్సవ్‌లో ద్వితీయ స్థానం

కైకలూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌లో కైకలూరు విద్యార్థులు ద్వితీయస్థానం సాధించారు. శుక్రవారం విజయవాడలో జరిగిన కళాఉత్సవ్ 2025 రాష్ట్రస్థాయి పోటీల్లో కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతుల విద్యార్థినులు బృందగానం చేసి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. వీరికి గైడ్ టీచర్‌గా సంగీతం టీచర్ భాస్కర్‌వరప్రసాద్ వ్యవహరించారు. హెచ్ఎం టి. వినోద, ఎంఈఓలు డి. రామారావు, శ్రీనివాసరావు, విద్యాకమిటీ ఛైర్మన్ బషీర్‌ఖాన్, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.



యోగా పోటీలకు ఎంపికైన గురుకుల బాలికలు

సత్తా చాటారు..

జిల్లా స్థాయి యోగా పోటీలకు..

ముసునూరు: జిల్లా స్థాయి యోగా పోటీలకు ముసునూరు గురుకుల బాలికలు ఎంపికయ్యారు. తిరువూరు డివిజన్ స్థాయిలో అండర్-17 యోగా పోటీల్లో పదవ తరగతి బాలికలు ఎల్.అను, కె.తప్సీ, సీహెచ్.దీపిక, జి.లోహిత, అలాగే అండర్-14 విభాగంలో ఎల్.హేమ, కె.ఐశ్వర్య, కె.సోవమ్మ, జె.హారిక, కె.మేర్సీ ప్రతిభను కనబర్చి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి తెలిపారు.

జిల్లా చదరంగం పోటీలకు..



చదరంగం పోటీలకు ఎంపికైన ఆగిరిపల్లి విద్యార్థులు

ఆగిరిపల్లి: జిల్లా స్థాయి చదరంగం పోటీలకు ఆగిరిపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం పి. పుష్పలత తెలిపారు. బాలుర సీనియర్ విభాగంలో కౌశిక్, జూనియర్ విభాగంలో షేక్ ఇమ్రాన్ జిల్లా స్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యారన్నారు. బాలికల సీనియర్ విభాగంలో ఎం. సురవరం హైస్కూల్ విద్యార్థిని జి. నమ్రతారోజ్ అర్హత సాధించింది

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ..



కలిదిండి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భాస్కరరావుపేట జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థినులు తాడి రమ్యశ్రీ, చవాకుల సుధా ధనలక్ష్మి ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.సునీల జ్యోతి తెలిపారు. స్కూల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మంతెన సుబ్బరాజు, పీడీ కుంబా సాంబశివరావు, హెచ్ఎం జ్యోతి విద్యార్థినులను అభినందించారు.

మార్కెట్ యార్డులో పునరావాస కేంద్రం ఏర్పాటు

కలిదిండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మార్కెట్ యార్డులో వరద బాధితులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. పడమటిపాలెంలో బంకు కాలనీ వరద బాధితులను పునరావాస కేంద్రానికి తరలించి భోజన వసతి కల్పించామన్నారు. బంకు కాలనీలో ఊర చెరువులో నీటి తొలగింపునకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

నాగుల చవితికి ఏర్పాట్లు పూర్తి

కలిదిండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పూజలకు పెదలంక నాగేశ్వరస్వామి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. పుట్ట వద్ద తొక్కిసలాట జరుగకుండా క్యూ పద్ధతి పాటించాలన్నారు.

నేడు సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నూజివీడు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి సందర్భంగా నూజివీడు మండలం అన్నవరం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బి.పుల్లారావు తెలిపారు. అభిషేక కార్యక్రమాలతో పాటు శివారాధన, సుబ్రహ్మణ్య సహస్రనామార్చన, నాగదేవత అష్టోత్తర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అన్నదానం ప్రారంభం

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రంగాపురంలోని శ్రీ షిర్డిసాయిబాబా మందిరం వద్ద అయ్యప్ప సేవా సమితి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అయ్య ప్ప, భవానీ మాలధారులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. గురు స్వాములు వేల్పూరి నానాజీ, నాని ఆధ్వర్యంలో మాలధారులు బాబాకు, అయ్యప్పస్వామికి పూజలు జరిపి అన్నదానం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎర్నేని కిషోర్ తొలి రోజు అన్నదానానికి దాతగా వ్యవహరించారు. బీజేపీ జిల్లా కో-కన్వీనర్ కోటప్రోలు కృష్ణారావు, జనసేన నాయకుడు అబ్బిసెట్టి నాగబాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిలకాబత్తిన నాగరాజు తదితరులు పూజలు జరిపారు.

బాబా ఆలయ వార్షికోత్సవం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి సాయి దుర్గానగర్‌లోని శ్రీషిరిడి సాయి బాబా మందిరం 16వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించినారు. వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం సాయినాథునికి అర్చకులు రామకృష్ణ దీక్షితులు, మంగళ హారతులు, ప్రవచనాలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. సాయి బాబా ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.

షట్టర్ తాళాలు పగులగొట్టి బైక్ చోరీ

ముదినేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): షట్టర్ తాళాలు పగులగొట్టి దుండగులు బైక్ చోరీకి పాల్పడిన ఉదంతమిది. విజయవాడ సమీపంలోని గుంగూరుకు చెందిన జి. చిన్నమనాయుడు గురువారం ముదినేపల్లి మండలం విశ్వనాద్రిపాలెం పనిమీద వచ్చి గంగూరు వెళుతుండగా ముదినేపల్లి వచ్చే సరికి వర్షం కురుస్తోంది. దీంతో బైక్‌ను ముదినేపల్లిలో తనకు తెలిసిన అనుకుమార్ షెడ్డులో బైక్‌ను ఉంచి వేరే వాహనంలో గంగూరు వెళ్ళిపోయాడు. శుక్రవారం ఉదయం ముదినేపల్లి రాగా షెడ్డు షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బైక్ కనిపించకపోవడంతో ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.